

నేడు సీఎం చంద్రబాబు రాక?

సీఎం చంద్రబాబు బుధవారం ఉమ్మడి జిల్లాకు వచ్చే అవకాశం ఉంది. వాతావరణ పరిస్థితులు అనుకూలిస్తే బుధవారం మధ్యాహ్నానికి ఆయన రాజమహేంద్రవరం చేరుకుంటారని సమాచారం. తుఫాన్ తీవ్రత అధికంగా ఉండడం, తీరం దాటిన సమయంలో భారీగా నష్టం చోటుచేసుకున్న నేపథ్యంలో స్వయంగా సహాయక చర్యలు పర్యవేక్షించనున్నారు. తుఫాన్ బాధిత ప్రాంతాల్లో పర్యటించనున్నారు.

గంటగంటకు పవన్ సమీక్ష

పిఠాపురం : తుఫాన్ ప్రభావం కారణంగా ప్రజలకు ఎటువంటి ఇబ్బంది లేకుండా పకడ్బందీగా సహాయక చర్యలు చేపట్టాలని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సూచించారు. నివేదికలు ఆధారంగా మంగళవారం ప్రతి గంటగంటకు తుఫాన్ పరిస్థితులపై కలెక్టర్ షాన్‌మోహన్, ప్రత్యేక అధికారి కృష్ణతేజ, జిల్లా ఎస్పీ బిందుమాధవ్‌లతో సమీక్షించారు. పిఠాపురం నియోజకవర్గంలో 25 పునరావాస శిబిరాలు ఏర్పాటు చేసి తాగునీరు, ఆహారం, ఔషధాలు, పాలు అందుబాటులో ఉంచడంతో పాటు జనరేటర్లను ఏర్పాటు చేయాలన్నారు. ఈ కేంద్రాల్లో 12 వేల మందికి మధ్యాహ్న భోజనం, 15 వేల మందికి రాత్రి భోజనం ఏర్పాటు చేశామని, 5 వేల పాలప్యాకెట్లు, 1.50 లక్షల వాటర్ ప్యాకెట్లుతో పాటు వాటర్ ట్యాంకర్లు అందుబాటులో ఉంచామన్నారు. ఉప్పాడ, కోనపాపపేట, మూలపేట తదితర గ్రామాల్లో సహాయక కార్యక్రమాల పర్యవేక్షణకు గ్రామానికో ప్రత్యేకాధికారిని నియమించామన్నారు.

ధైర్యంగా ఉండండి : మంత్రి దుర్గేష్

నిడదవోలు : మొంథా తుఫాన్ పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రజలకు అండగా ఉన్నామని.. ప్రజలంతా ధైర్యంగా ఉండాలని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. నిడదవోలులోని తమ క్యాంపు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని.. అత్యవసర పరిస్థితుల్లో అధికారులు.. ప్రజలకు మధ్య అనుసంధానం చేస్తామన్నారు. తుఫాన్ బాధిత ప్రజలు 98481 66644, 95503 65446, 88865 19418, 94404 07096 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

అప్రమత్తంగా ఉండాలి : పురందేశ్వరి

రాజమహేంద్రవరం అర్బన్ : మొంథా తుఫాన్ నేపథ్యంలో ప్రజల భద్రతకు ప్రభుత్వం అన్ని ముందస్తు చర్యలు తీసుకుందని రాజమహేంద్రవరం ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. ఐక్య రాజ్యసమితి జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో పాల్గొనేందుకు అమెరికా వెళ్లిన పురందేశ్వరి రాష్ట్రంలోని తుఫాన్ పరిస్థితులపై ఎప్పటికప్పుడు అధికారులతో మాట్లాడారు.ముందస్తు చర్యలపై ఆరా తీశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు ప్రభుత్వ అధికారులకు సహకరించాలని, సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని సూచించారు. తుఫాన్ బాధిత ప్రాంతాల్లో వలంటీర్లుగా సేవలందించడానికి బీజేపీ శ్రేణులు సిద్ధంగా ఉన్నాయని జిల్లా అధ్యక్షుడు నాగేంద్ర తెలిపారు.

ముంపు లేకుండా చర్యలు : ఎంపీ

పిఠాపురం : ఏలేరు వరద ముంపు లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నట్టు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ తెలిపారు. పిఠాపురం-గొల్లప్రోలు మధ్య పిడిందొడ్డి రెగ్యులేటర్ సమీపంలో కోతకు గురవుతున్న ఏలేరు కాలువ గట్లను మంగళవారం సాయంత్రం డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబులతో కలిసి పరిశీలించారు. గట్లు కోతకు గురి కాకుండా ఇసుక బస్తాలు వేసే పనులను పరిశీలించారు. ఏలేరు కాల్వ గట్లపై పడిపోయిన చెట్లను తక్షణం తొలగించాలని ఇరిగేషన్ ఎస్ఈకి ఫోనులో సూచించారు. అనంతరం గొల్లప్రోలు బల్లకట్టు వద్ద ఏలేరు వరదను పరిశీలించారు. గట్లకు గండ్లు పడకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.


ఏలేరు కాలువగట్టు పరిశీలిస్తున్న, ఎంపీ ఉదయ్ శ్రీనివాస్


మండపేట, అమలాపురంలో ఇలా

వనంపై రణం
భారీ వృక్షాలు వేళ్లతో సహా పైకిలేచాయి.. చెట్లు విరిగిపడ్డాయ్.. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంగళవారం కనిపించిన చిత్రమిది.. తుఫాన్ నేపథ్యంలో ఈదురు గాలులకు వేల సంఖ్యలో చెట్లు నేలవాలాయి.


బిక్కవోలులో ఈదురుగాలులకు ఊగుతున్న కొబ్బరిచెట్లు

చినుకు వణుకు
వరుణుడు తుఫాన్ జాడ చెబుతూనే ఉన్నాడు.. మంగళవారం ఉదయం నుంచి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎక్కడా తెరిపివ్వలేదు. వర్షం పడుతూనే ఉంది.. దీంతో అంతటా అప్రమత్తమయ్యారు.


అనపర్తి, అల్లవరంలలో కూలిన విద్యుత్ స్తంభాలు

కరెంట్ ఇష్యూ
తుఫాన్ దెబ్బకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేల సంఖ్యలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అయితే ఎన్నడూలేనంత వేగంగా వాటిని పునరుద్ధరించడం విశేషం.


అక్కడే తీరం దాటేది : కాకినాడ నుంచి తుఫాన్ తీవ్రతను పరిశీలిస్తున్న ఏలూరు రేంజ్ ఐజీ అశోక్‌కుమార్


అల్లకల్లోలం : తుఫాన్ తీవ్రత కారణంగా ఉప్పాడ వద్ద బీచ్‌రోడ్డుపైకి ఎగదిపడుతున్న అలలు..ఈ రోడ్డులోనే అలల ధాటికి రాళ్లు ఎగిరిపడుతున్నాయి.. ఇప్పటి వరకూ రెండు చోట్ల గండి కూడా పడింది.. బుధవారం తీవ్రత ఎలా ఉంటుందోనని పరీవాహక ప్రాంత ప్రజానీకం భయాందోళన చెందుతున్నారు.


చొచ్చుకొచ్చింది : ఉప్పలగుప్తం మండలం ఎస్.యానాం రెస్ట్ ప్లాంట్ భవన సముదాయాన్ని చుట్టుముట్టిన సముద్రపు నీరు

ఉగ్ర మొంథా!

భీకరం.. భయంకరం

(కాకినాడ/అమలాపురం - ఆంధ్రజ్యోతి)

ఏం జరుగుతుందో.. ఏమైపోతుందో..
ఎక్కడ తీరం దాటుతుందో..
గత మూడు రోజులుగా ఒక్కటే టెన్షన్..
ఎందుకంటే మొత్తమొంథా కమ్మేసింది..
పచ్చని గోదావరి జిల్లాల్లో అల్లకల్లోలం..
తుఫాన్ తీవ్రతకు అతలాకుతలమయ్యాయి..
ఎటు చూసినా కూలిన చెట్లు.. భారీ వృక్షాలు
విరిగిపడిన విద్యుత్ స్తంభాలు.. కొబ్బరి చెట్లు..
వెన్నువిరిగిన వరి చేలు..
అంతా బాగుందనుకునేలోపే ఉపద్రవం..
ఎటు చూసినా కష్టం.. నష్టమే మిగిల్చింది..
ప్రభుత్వం అప్రమత్తమైంది..
ఒక పక్కన చంద్రబాబు.. మరో పక్కన పవన్..
సమీక్షలు చేస్తూనే ఉన్నారు..
పోలీసులు అప్రమత్తమయ్యారు..
పలు రైళ్లు, బస్ సర్వీసులు రద్దు చేశారు.
బడులకు సెలవులిచ్చేశారు..
తుఫాన్ సహాయక చర్యల నిమిత్తం
సీఎం చంద్రబాబు రానుండడంతో
అధికారులు ఉరుకులు
పరుగులు పెడుతున్నారు..

- అంతర్వేది వద్ద తీరం దాటిన తుఫాన్
- వణికించిన తుఫాన్.. ఉమ్మడి జిల్లా విలవిల
- ఈదురుగాలులు, కుంభవృష్టి వానలు
- ఉప్పాడ వద్ద బీచ్ రోడ్డుకు గండ్లు
- నేడు బడులకు సెలవు

కుంభవృష్టిగా వాన.. కూకటివేళ్లతో లేచిపోయిన వేలాది కొబ్బరిచెట్లు.. తాటిచెట్లు.. సముద్రం కూడా ప్రళయంగా మారింది.. మొంథా తుఫాన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాను చిగురుటాకులా వణికించింది. 1996 నవంబరు 6 తుఫాన్‌ను గుర్తుచేస్తూ ప్రజలు విలవిలలాడేలా చేసింది. కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలు తుఫాన్ తీవ్రతకు విలవిల్లాడాయి. ఉదయం నుంచీ ఈ రెండు జిల్లాలతో పాటు తూర్పుగోదావరి జిల్లాలోనూ భారీ వర్షం కురిసింది. అదే సమయంలో తీవ్రమైన పెను గాలులు భయాందోళనలకు గురిచేశాయి.గాలుల తీవ్రతకు మహా వృక్షాలు నేలకొరిగాయి. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వేలాది చెట్లు కూకటివేళ్లతో సహా నేలవాలాయి. అటు తుఫాన్ తీరం దాటే సమయంలో మంగళవారం అర్ధరాత్రి కాకినాడ, కోనసీమ జిల్లాల్లో కుంభవృష్టిని మించిన వాన కురిసింది. అటు తీర ప్రాంతంలో ఈదురుగాలులు భీకరంగా మారి హోరున శబ్దాలతో జనాన్ని వణికించాయి. అర్ధరాత్రి పన్నెండు దాటే సమయానికి కోనసీమ జిల్లాలో వేలాది కొబ్బరి, ఇతర చెట్లు నేలకూలాయి.అమలాపురం- రావులపాలెం జాతీయ రహదారి పైనా భారీ వృక్షాలు నేలకూలాయి. అంతర్వేదిపాలెంలో తుఫాన్ తీరం దాటడంతో సముద్రం అల్లకల్లోలంగా మారింది. అంతర్వేదిలో సముద్రపు కెరటాలు లైట్‌హౌస్‌కు తాకాయి. రాజోలు నియోజకవర్గంలో పలు సెల్‌టవర్లు దెబ్బతిన్నాయి. తుఫాన్ హెచ్చరికలతో కోనసీమ జిల్లా ఇన్‌చార్జి మంత్రి అచ్చెన్నాయుడు హుటాహుటిన అమలాపురం చేరుకుని అధికారులతో సమీక్షించారు. ఇక మంగళవారం సాయంత్రం నుంచి జిల్లావ్యాప్తంగా అన్ని రహదారులపై రాకపోకలు నిలిపివేశారు. కాకినాడ, తూర్పుగోదావరి జిల్లా నుంచి కూడా అన్ని బస్సులను కోనసీమకు వెళ్లకుండా నిలిపివేశారు. దాదాపు అన్ని చోట్ల దుకాణాలు మూసివేయడంతో రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. తుఫాన్ తీవ్రతకు కాకినాడ ఉప్పాడ బీచ్ ప్రళయంగా మారింది. పదిహేను మీటర్లకు పైగా ఎత్తున అలలు ఎగసిపడడంతో బీచ్ రోడ్డుకు రెండుచోట్ల గండిపడింది. మరోపక్క తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస శిబిరాలకు తీరప్రాంత ప్రజలను అధికారులు బస్సుల్లో తరలించారు.మంగళవారం ఉదయం నుంచీ చెట్లు కూలిన ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను ఎక్కడిక్కడ అధికారులు నిలిపివేశారు. కూలిన విద్యుత్ స్తంభాలను మార్చడం, ధ్వంసమైన ట్రాన్స్‌ఫార్మర్లను కొత్తవి ఏర్పాటుచేసి విద్యుత్ సరఫరాను గంటల వ్యవధిలోనే పునరుద్ధరించారు.కొన్ని గ్రామాల్లో మాత్రం అంధకారం నెలకొంది. తుఫాన్ మంగళవారం అర్ధరాత్రి తీరం దాటగా..దీని ప్రభావంతో మరో రెండు రోజులు భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది.

భారీ వాహనాలు నిలిపివేత

తుఫాన్ నేపథ్యంలో 16వ నెంబరు జాతీయ రహదారి పై రాత్రి ఏడు గంటల నుంచి భారీ వాహనాలు నిలిపివేశారు. జగ్గంపేటలో చెన్నై టు కోల్‌కతా జాతీయ రహదారి మూసివేశారు. దాంతో భారీ వాహనాలన్నీ ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. రోడ్లన్నీ వాహనాలతో నిండిపోయాయి.




అన్నదాతకు వర్రీయే : తుఫాన్ తీవ్రతకు అంబాజీపేట మండలం గంగలకుర్రులో నేలకొరిగిన వరిచేను.. ఉమ్మడి జిల్లాలో చాలా చోట్ల ఇదే పరిస్థితి..



తాటిచెట్టు విరిగిపడి మహిళ దుర్మరణం

మామిడికుదురు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): పలకరించడానికి వచ్చిన ఒక మహిళ తాడిచెట్టు విరిగి పడి మృతిచెందింది. కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం మాకనపాలెం గ్రామానికి చెందిన గూడపల్లి వీరవేణు (49) అదే గ్రామంలో ఉండే తన ఆడబడుచు కుమారుడు అనారోగ్యం పాలవడంతో అతడిని పలకరించడానికి వచ్చింది. తిరిగి వెళ్లే సమయంలో ఈదురుగాలుల ప్రభావంతో తాడిచెట్టు విరిగి మీద పడి అక్కడికక్కడే మృతిచెందింది. దీంతో మాకనపాలెం గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. సంఘటనా స్థలాన్ని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సందర్శించి ఆ కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

గోదావరి నదుల్లోకి ఉప్పునీటి ప్రవాహం

అమలాపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో బంగాళాఖాతంలోని సముద్రపు అలలు ఉవ్వెత్తున ఎగసిపడుతూ గోదావరి నదీపాయల్లోకి నీటి ప్రవాహం పోటెత్తుతోంది. దాంతో కోనసీమ జిల్లాలోని గౌతమీ, వశిష్ఠ, వైనతేయ, వృద్ధగౌతమీ నదీపాయల్లో నీటిమట్టం అనూహ్యంగా పెరిగిపోతోంది. సాధారణంగా ఉండే గోదావరి ప్రవాహంలో ఉప్పునీటి సాంద్రత పెరగడంతో పాటు సముద్ర అలలకు నీరు వెనక్కు రావడం వల్ల నదీపాయలన్నీ పొంగి ప్రవహిస్తున్నాయి. గతంకంటే భిన్నంగా నీటిమట్టం ఒక్కసారిగా పెరిగి నదీపాయలన్నీ జలకళ సంతరించుకున్నాయి. దీనికితోడు గోదావరి నదుల వెంబడి పాల నురగ మాదిరిగా నీటి ప్రవాహం కనిపిస్తోంది.

ఎటుచూసినా వృక్ష విలాపం..

తుఫాన్ ప్రభావంతో వీచిన గాలులకు జిల్లావ్యాప్తంగా పలు వృక్షాలతోపాటు కొబ్బరి చెట్లు ఎక్కడికక్కడే కుప్పకూలిపోయాయి. కొన్నిచోట్ల విద్యుత్ స్తంభాలు కూడా నేలకొరిగాయి. జాతీయ రహదారులు, రాష్ట్ర రహదారులు, గ్రామీణ రహదారుల వెంబడి ఉన్న చెట్లు, కొబ్బరిచెట్లు స్వల్పంగా వీచిన గాలికే కుప్పకూలిపోయాయి. విద్యుత్ స్తంభాలూ చాలా ప్రాంతాల్లో నేలమట్టం అయ్యాయి. ఇళ్ల మీద, విద్యుత్ వైర్లపైనా చెట్లు కూలడంతో ఆ ఇళ్లకు నష్టం వాటిల్లి విద్యుత్ సరఫరాకు తీవ్ర అవాంతరం ఏర్పడ్డ పరిస్థితులు తీర ప్రాంత గ్రామాల్లో నెలకొన్నాయి.


కలెక్టరేట్‌లో మంగళవారం సాయంత్రం జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులతో సమీక్ష నిర్వహించిన మంత్రి అచ్చెన్నాయుడు, ప్రత్యేకాధికారి విజయరామరాజు, కలెక్టర్, జేసీ, ఎస్పీ

ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలి

- అమలాపురంలో తుఫాన్ పరిస్థితిపై సమీక్షించిన మంత్రి అచ్చెన్నాయుడు
- ప్రత్యేకాధికారి విజయరామరాజు, కలెక్టర్, ఎస్పీ, ఎంపీ, ఎమ్మెల్యేలు హాజరు
- పునరావాస కేంద్రాల్లో సహాయ చర్యలు కొనసాగించాలని మంత్రి ఆదేశం

అమలాపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్లు, వరదలు వంటి ప్రకృతి వైపరీత్యాలు సహజ సిద్ధంగా సంభవిస్తుంటాయని, కానీ వాటివల్ల ప్రజల ప్రాణాలు, ఆస్తి నష్టాలకు తావు లేకుండా ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ యంత్రాంగం సమన్వయంతో పనిచేయాలని జిల్లా ఇన్‌చార్జి మంత్రి వ్యవసాయ సహకార మార్కెటింగ్‌శాఖ, డెయిరీ డెవలెప్మెంట్, మత్స్యశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు అన్నారు. మంగళవారం సాయంత్రం అమలాపురంలోని కలెక్టరేట్‌లో వివిధ ప్రభుత్వశాఖల అధికారులతో మొంథా తుఫాన్ తీవ్రత, సహాయ పునరావాస కేంద్రాల నిర్వహణ, రోడ్లు, రాకపోకలు, విద్యుత్ సరఫరా అంశాలపై తుఫాన్ ప్రత్యేకాధికారిగా నియమితులైన విజయరామరాజు, జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ జిల్లా యంత్రాంగం ప్రజల ఆస్తి, ప్రాణ నష్టాలకు ఆస్కారం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సహాయ చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. సీఎం చంద్రబాబు ఇప్పటికే తుఫాన్ తీవ్రతపై సమీక్షించారని చెప్పారు. జిల్లాలో మామిడికుదురు మండలం మాకనపాలెంలో తాడిచెట్టు పడి ఒక మహిళ మృతి చెందిన సంఘటన దురదృష్టకరమని, ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా తగు చర్యలు తీసుకోవాలని, ప్రజలు కూడా అధికారుల సూచనల మేరకు సహకరించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ప్రకృతి విపత్తుల పట్ల వెంటనే స్పందించి క్షేత్రస్థాయిలో పర్యవేక్షిస్తూ నష్టాల తీవ్రతను తగ్గించడంలో సీఎం చంద్రబాబు ఎంతో అనుభవం ఉందన్నారు. తుఫాన్‌ల తీవ్రత వల్ల జరిగే నష్టాలను నివారించి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. పూరిల్లు, పక్కా గృహాలు సముద్ర తీరానికి ఒక కిలోమీటరు పరిధిలో నివాసం ఉంటున్న వారందరినీ పునరావాస కేంద్రాలకు తరలించాలని మంత్రి ఆదేశించారు. ఇల్లు విడిచి బయటకి రావడానికి ఇష్టపడనివారిని బలవంతంగానైనా తరలించాలన్నారు. ప్రభుత్వం పునరావాసం కల్పించి భోజనం వంటి ఆహార సదుపాయాలు అందిస్తుందని, అక్కడి నుంచి తిరిగి ఇళ్లకు వెళ్లే ముందు కుటుంబానికి రూ.3 వేల ఆర్థిక సాయాన్ని, మత్స్యకారులకు 25కిలోల ఉచిత బియ్యం అందిస్తామని మంత్రి అచ్చెన్నాయుడు వివరించారు. కలెక్టర్ సూచనతో అవసరమైన చోట జనరేటర్లు ఏర్పాటుచేయాలని, ప్రజలకు ఇబ్బందులు లేకుండా సహాయ చర్యలు కొనసాగించాలని, విద్యుత్ సదుపాయాన్ని పునరుద్ధరించేలా ఎప్పటికప్పుడు చర్యలు తీసుకోవాలని జిల్లా మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఈ సమావేశంలో ఎంపీ జి.హరీష్‌బాలయోగి, ఎమ్మెల్యేలు అయితాబత్తుల ఆనందరావు, దాట్ల బుచ్చిరాజు, జిల్లా ఎస్పీ రాహుల్‌మీనా, జాయింట్ కలెక్టర్ నిషాంతి, డీఆర్వో మాధవితోపాటు వివిధ ప్రభుత్వశాఖల అధికారులు పాల్గొన్నారు.

జిల్లాలో 327 బస్సు సర్వీసులు రద్దు

పి.గన్నవరం/అమలాపురం రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావం కారణంగా మంగళవారం ప్రజారవాణా పూర్తిగా స్తంభించింది. వాతావరణం కేంద్రం హెచ్చరికల దృష్ట్యా రెండురోజులుగా తుఫాన్‌పై ఉన్నతాధికారులు ఆధ్వర్యంలో తీవ్ర హెచ్చరికలు జారీతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. జిల్లావ్యాప్తంగా రామచంద్రపురం, రాజోలు, రావులపాలెం, అమలాపురం బస్‌స్టేషన్‌ల పరిధిలో ఉన్న 327 బస్సు సర్వీసులను పూర్తిగా రద్దు చేశామని జిల్లా ప్రజారవాణా అధికారి ఎస్‌టీపీ రాఘవకుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశాల మేరకు తుఫాన్ ప్రభావం తగ్గే వరకు జిల్లాలో ఉన్న ప్రధాన సర్వీసులను పూర్తిస్థాయిలో రద్దు చేశామన్నారు. తుఫాన్ పూర్తిగా తగ్గే వరకు ప్రయాణికులు ఎవరూ బస్టాండ్‌లకు రావద్దని కోరారు.


అంతర్వేదిపల్లిపాలెంలో తుఫాన్ షెల్టర్ వద్ద మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అంతర్వేదిపల్లిపాలెంలో అర్ధరాత్రి కలెక్టర్ పర్యటన

అంతర్వేది/మలికిపురం, అక్టోబరు28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ తీరాన్ని తాకిందన్న సమాచారంతో సఖినేటిపల్లి మండలం అంతర్వేదిపల్లిపాలెంలో మంగళవారం అర్ధరాత్రి కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ పర్యటించారు. అక్కడ ఉన్న తుఫాన్ షెల్టర్‌ను ఆయన సందర్శించారు. గ్రామంలోని పరిస్థితులను స్వయంగా పర్యవేక్షించారు. తుఫాన్ తీరం దాటాక కూడా భారీ వర్షాలు ఉండే అవకాశం ఉన్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. అలాగే మలికిపురం మండలం గుడిమల్లంకలో కలెక్టర్ స్థానిక అధికారులతో మాట్లాడారు. తహశీల్దార్ శ్రీనివాసరావుతో తుఫాన్‌పై చర్చించారు.

గోదావరి, గౌతమి సహా మరిన్ని రైళ్లు తాత్కాలిక రద్దు

ఫలక్‌నుమా దారి మళ్లింపు

రాజమహేంద్రవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాన్ నేపథ్యంలో మరిన్ని రైళ్లను తాత్కాలికంగా రద్దు చేశారు. రాజమహేంద్రవరం, సామర్లకోట మీదుగా వెళ్లాల్సిన సుమారు 20 రైళ్లను తాత్కాలికంగా నిలిపివేశారు. పలు రైళ్ల సమయాలను సవరించారు. సికింద్రాబాద్ వైపు వెళ్లే రైళ్లను దాదాపు రద్దు చేశారు. 28న 17210 కాకినాడ-బెంగళూరు, 07060 అనకాపల్లి-సికింద్రాబాద్, 17247 నర్సాపురం-ధర్మవరం, 17255 నర్సాపురం-లింగంపల్లి, 12737 కాకినాడ-లింగంపల్లి, 12755 కాకినాడ-లింగంపల్లి, 17215 మచిలీపట్నం-హిందూపురం, 17215 మచిలీపట్నం-హిందూపురం, 12727 విశాఖ-హైదరాబాద్, 22203 విశాఖ-నాందేడ్, 12738 లింగంపల్లి-కాకినాడ, 29న 17248 ధర్మవరం-నర్సాపురం, 17256 లింగంపల్లి-నర్సాపురం, 12776 లింగంపల్లి-కాకినాడ, 17216 హిందూపురం-మచిలీపట్నం, 30న 17479 పూరి-తిరుపతి తాత్కాలికంగా రద్దయ్యాయి. 12703 హౌరా-సికింద్రాబాద్ ఫలక్‌నుమా, 18638 బెంగళూరు-హతియా, 18189 టాటానగర్-ఎర్నాకులం రైళ్లను దారి మళ్లించారు. 12842 చెన్నై-హౌరా, 22870 చెన్నై-విశాఖ, 22604 విల్లుపురం- ఖరగ్‌పూర్, 12840 చెన్నై-హౌరా, 12664 తిరుచిరాపల్లి-హౌరా, 22501 బెంగళూరు-న్యూ తిన్సుకియా, 12836 బెంగళూరు-హతియా, 12503 బెంగళూరు-అగర్తలా, 12246 బెంగళూరు-హౌరా, 12864 బెంగళూరు-హౌరా, 18045 షాలిమార్-చర్లపల్లి, 22825 షాలిమార్-చెన్నై, 22887 హౌరా-బెంగళూరు, 12841 హౌరా-చెన్నై, 22807 సంత్రాగచి-చెన్నై, 22853 షాలిమార్-విశాఖ, 17481 బిలాస్‌పూర్-తిరుపతి, 13351 ధన్‌బాద్-అలెప్పీ, 03252 బెంగళూరు-ధన్‌బాద్ రైళ్ల ప్రారంభ స్టేషన్ల నుంచి బయల్దేరే సమయాలను 28న 7 నుంచి 12 గంటలు పొడిగించారు. ఈ రైళ్లు ఆలస్యంగా నడవనున్నాయి. రాజమహేంద్రవరంలోని ఆర్చి బ్రిడ్జిపై మరమ్మతులు జరుగుతున్నాయి. వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా రైళ్లను నిలుపుదల చేయనున్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి):
కాకినాడ జిల్లా సామర్లకోట మీదుగా రాకపోకలు సాగించే మరో 22 ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేసినట్టు రైల్వే పీఆర్వో కార్యాలయ అధికారులు తెలిపారు. 12806 లింగంపల్లి-విశాఖ, 18046 చర్లపల్లి-షాలీమార్, 17016 సికింద్రాబాద్-భువనేశ్వర్, 12704 సికింద్రాబాద్-హౌరా, 17480 తిరుపతి- పూరి, 18522 కడప-విశాఖ, 18463 భువనేశ్వర్- బెంగళూరు, 17015 భువనేశ్వర్-సికింద్రాబాద్, 20851 భువనేశ్వర్-పుదుచ్చేరి, 22875, 22876 విశాఖ- గుంటూరు-విశాఖ, 12727 విశాఖ-సికిం ద్రాబాద్, 12739 విశాఖ-సికింద్రాబాద్, 20835 విశాఖ-న్యూఢిల్లీ, 17220 విశాఖ-మచిలీపట్నం, 18519 విశాఖ-ముంబయి, 17244 రాయగడ- గుంటూరు, 11020 భువనేశ్వర్-ముంబయి ఎక్స్ ప్రెస్ మంగళవారం రద్దయ్యాయి. 12738 లింగంపల్లి-కాకినాడ ఎక్స్‌ప్రెస్‌ను బుధవారం రద్దు చేశారు. సామర్లకోట రైల్వే స్టేషన్లో ప్రయాణికులకు మరింత సమాచారం అందించేందుకు ఏర్పాటుచేసిన హెల్ప్ డెస్క్‌ను కొనసాగిస్తున్నట్టు సూపరింటెండెంట్ రమేష్ తెలిపారు.

తీర గ్రామాల్లో ప్రత్యేక పర్యవేక్షణ చేయాలి

ఏలూరు రేంజ్ ఐజీ అకోక్‌కుమార్

కాకినాడ క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావిత ప్రాంతాలను కాకినాడ జిల్లా పోలీసు కార్యాలయ కంట్రోల్ రూమ్ నుంచి మంగళవారం ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్ లైవ్ మ్యాప్ ద్వారా పరిశీలించారు. గ్రేహౌండ్స్ డీఐజీ అట్టాడ బాపూజీ, ఎస్పీ జి.బిందుమాధవ్‌లతో కలిసి జిల్లాలోని పరిస్థితులను సమీక్షించారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల వాతావరణ పరిస్థితులు, వర్షపాతం, గాలి వేగం వంటి వివరాలను వీండి లైవ్ మ్యాప్ ద్వారా పరిశీలించారు. తుఫాన్ సమయంలో ప్రజల భద్రత, వాహన రాకపోకల నియంత్రణ, రక్షణ చర్యలు, అత్యవసర సేవలు సమర్థవంతంగా కొనసాగేందుకు తగిన సూచనలు చేశారు. పోలీసు, అగ్నిమాపక, రెవెన్యూ, విద్యుత్ శాఖల అధికారులు సమన్వయంతో ప్రతిస్పందన బృందాలను సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు. తుఫాన్ ప్రభావం ఎక్కువగా ఉండే తీర ప్రాంతాల్లో నిరంతరం ప్రత్యేక పర్యవేక్షణ చేయాలని సూచించారు. ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నప్పుడు ప్రజలకు సకాలంలో సమాచారం అందించేందుకు కమాండ్ కంట్రోల్ సెంటరును 24 గంటలూ యాక్టివ్‌గా ఉంచాలని ఆదేశించారు. ప్రజలు అత్యవసరమైతేనే తప్ప బయటకు రాకుండా అధికారులు చూడాలన్నారు. అన్ని శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండి తుఫాన్ సాధారణ స్థాయికి వచ్చేంత వరకు ప్రజల భద్రతను కాపాడేందుకు తగిన చర్యలు చేపట్టాలని ఐజీ కోరారు.

తాండవ జలాశయం నుంచి

నీటి విడుదల

● పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తం


తుని వద్ద ఉధృతంగా తాండవ ప్రవాహం

తుని రూరల్/కోటనందూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తాండవ జలాశయం నుంచి నీటిని దిగువకు విడిచిపెట్టిన నేపథ్యంలో తుని వద్ద తాండవ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో అధికార యంత్రాంగం 1వ వార్డుతో పాటుగా నదీ ప్రవాహాన్ని ఆనుకుని నివాసముంటున్న ప్రజానీకాన్ని అప్రమత్తం చేశారు. తాండవ జలాశయం పూర్తిస్థాయి నీటిమట్టం 380 అడుగులు కాగా, ప్రస్తుతం 377.70 అడుగులకు చేరింది. ఇన్‌ఫ్లో 1200 క్యూసెక్కులుగా ఉంది. మొంథా తుపాన్ నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తగా స్పిల్‌వే ద్వారా 2472 క్యూసెక్కుల నీటిని నదిలోకి విడుదల చేశారు.


గొల్లప్రోలులో మంగళవారం రాత్రి ఎనిమిది గంటల సమయంలో విద్యుత్ స్తంభాలను సరిచేసి మరమ్మతులు నిర్వహిస్తున్న సిబ్బంది

విద్యుత్ స్తంభాలకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు

గొల్లప్రోలు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో ఉత్పన్నమైన పరిస్థితులకు ఏపీఈపీడీసీఎల్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన స్పందించారు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు వీచిన ఈదురు గాలులకు కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణం, మండలంతో పాటు పిఠాపురం పట్టణం, మండల పరిధిలోని గ్రామాల్లో 115కి పైగా ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు దెబ్బతిన్నాయి. అంతకంటే అధిక సంఖ్యలో కరెంటు తీగలు తెగిపోయాయి. ఉదయం నుంచి వర్షం పడుతున్నా, గాలులు వీస్తున్నా లెక్క చేయకుండా క్రేన్లు, ఎక్స్‌కవేటర్ల సహాయంతో స్తంభాలను సరిచేయడం, మార్పు చేయడంతో పాటు కొత్తగా విద్యుత్ తీగలు ఏర్పాటుచేసి మరమ్మతులు నిర్వహించారు. ఏపీఈపీడీసీఎల్ సిబ్బంది, అధికారులు అర్ధరాత్రి వరకు ఇదే పనిలో నిమగ్నమయ్యారు.

కోతకు గురవుతున్న జాతీయ రహదారి

ఏలేరు నీటి ఉధృతితో కలవరం

గొల్లప్రోలు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఏలేరు ప్రవాహ ఉధృతికి 216 జాతీయ రహదారి కోతకు గురవుతోంది. ఏలేరు నుంచి వస్తున్న వరద జలాలు గొల్లప్రోలు టోల్‌గేట్ సమీపంలో పిఠాపురం-గొల్లప్రోలు వైపు వెళ్లే రోడ్డును కోస్తుండడం ఆందోళన కలిగిస్తోంది. రిజర్వాయరు నుంచి నీటి విడుదల ఏమాత్రం అధికమైనా రహదారి మరింతగా కోతకు గురయ్యే అవకాశం ఉంది. రోడ్డు తెగిపోతే పంట పొలాలు ముంపునకు గురవుతాయని రైతులు చెప్తున్నారు. ఈ విషయాన్ని కాకినాడ ఆర్డీవో మల్లిబాబు దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసుకెళ్లడంతో ఆయన నేషనల్ హైవే అథారిటీ పీడీతో ఫోనులో మాట్లాడారు. తక్షణం కోతకు గురికాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.


గొల్లప్రోలు టోల్‌గేట్ సమీపంలో కోతకు గురవుతున్న 216వ జాతీయ రహదారి



బోసిపోయిన కడియం పూల మార్కెట్

కడియం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో వ్యాపారులు ఇళ్లకే పరిమితమయ్యారు. దీంతో పూల రైతులు, వ్యాపారులతో నిత్యం రద్దీగా ఉండే కడియపులంక అంతర్ రాష్ట్ర పూల మార్కెట్ బోసిపోయింది. వ్యాపార సంస్థలను మూసివేశారు. ఉదయం నుంచి వర్షం పడుతుండడంతో జనజీవనం స్తంభించింది. నిత్యం సందర్శకులతో కళకళలాడే నర్సరీలు ఖాళీగా కనిపించాయి.

వ్యాపారులు, రైతులు లేక ఖాళీగా ఉన్న అంతర్ రాష్ట్ర పూల మార్కెట్

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

కొత్త తేదీన ఆర్యన్



విష్ణు విశాల్ కథానాయకుడిగా నటించిన 'ఆర్యన్' చిత్రం విడుదల కొత్త తేదీకి మారింది. ముందు ప్రకటించిన విధంగా ఈ నెల 31న ఈ చిత్రం విడుదలవ్వడం లేదు. ఒక వారం ఆలస్యంగా నవంబర్ 7న 'ఆర్యన్' చిత్రాన్ని విడుదల చేయాలని నిర్ణయించుకున్నట్లు విష్ణు విశాల్ తెలిపారు. 'రవితేజ నటించిన 'మాస్ జాతర', 'బాహుబలి: ది ఎపిక్' చిత్రాలు కూడా ఈ నెల 31న విడుదలవుతున్నాయి. రవితేజతో నాకున్న స్నేహం, రాజమౌళిపై గౌరవంతో ఈ నిర్ణయం తీసుకున్నాం' అని ఆయన తెలిపారు. అయితే 'ఆర్యన్' తమిళ వెర్షన్ మాత్రం ఈ నెల 31నే విడుదలవనుంది. ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్‌గా తెరకెక్కిన 'ఆర్యన్' చిత్రానికి ప్రవీణ్ కె దర్శకుడు. శుభ్ర, ఆర్యన్ రమేశ్ నిర్మించారు. శ్రద్ధా శ్రీనాథ్ కథానాయిక. సెల్వ రాఘవన్ కీలకపాత్ర పోషించారు. శ్రేష్ట్ మూవీస్ అధినేత సుధాకర్ రెడ్డి ఈ చిత్రాన్ని తెలుగు రాష్ట్రాల్లో విడుదల చేస్తున్నారు.



ఉగాదిన విడుదల

అడివి శేష్ కథానాయకుడిగా షానియల్ డియో తెరకెక్కిస్తోన్న రొమాంటిక్ యాక్షన్ థ్రిల్లర్ 'డెకాయిట్'. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ తెలుగు, హిందీ భాషల్లో నిర్మిస్తున్నారు. సునీల్ నారంగ్ సహ నిర్మాత. మొదట డిసెంబరు 25న విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. కానీ కొన్ని అనివార్య కారణాల వల్ల వాయిదా పడింది. తాజాగా మేకర్స్ కొత్త తేదీని ప్రకటించారు. 2026 ఉగాది పండగ సందర్భంగా మార్చి 19న థియేటర్లలోకి రానున్నట్లు తెలిపారు. ఈ మేరకు సంబంధిత పోస్టర్‌ని అడివి శేష్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. 'ఈసారి మామూలుగా ఉండదు. ముందుకి వెళ్లడమే తప్ప వెనక్కి చూడాల్సిన అవసరమే లేదు' అని క్యాప్షన్ పెట్టారు. కాగా, అడివి శేష్ సరసన కథానాయికగా మృణాల్ ఠాకూర్ నటిస్తున్నారు. బాలీవుడ్ దర్శకుడు, నటుడు అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ చిత్రానికి భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.

శ్రీకాంత్ తివారి వచ్చేస్తున్నాడు



ఓటీటీ ప్లాట్‌ఫామ్‌పై ఓ సరికొత్త ఒరవడిని సృష్టించిన వెబ్ సిరీస్ 'ది ఫ్యామిలీ మ్యాన్'. ఇప్పటి వరకూ రెండు సీజన్లు విజయవంతంగా పూర్తి చేసుకున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ సిరీస్‌లో మూడో భాగం సిద్ధమైంది. మనోజ్ బాజ్‌పాయ్, ప్రియమణి ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సిరీస్‌ను రాజ్ అండ్ డీకే తెరకెక్కించారు. ఈ ప్రాజెక్టును ప్రకటించినప్పటి నుంచి స్ట్రీమింగ్ వివరాల కోసం అభిమానులు ఎంతగానో ఆసక్తిగా ఎదురుచూడసాగారు. తాజాగా మేకర్స్ స్ట్రీమింగ్ తేదీని ప్రకటించారు. ఆమెజాన్ ప్రైమ్‌లో నవంబరు 21 నుంచి అందుబాటులోకి రానున్నట్లు వెల్లడించారు. దీనికి సంబంధించిన ఓ వీడియోను కూడా షేర్ చేశారు. థ్రెట్ అనాలిసిస్ అండ్ సర్వైవలెన్స్ సెల్(టాస్క్) సీనియర్ ఆఫీసర్ శ్రీకాంత్ తివారి పాత్రలో మనోజ్ బాజ్‌పాయ్ మరోసారి అలరించనున్నారు. రెండు సీజన్లలో మనోజ్ బాజ్‌పాయ్ నటనకు ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు లభించాయి. ఇప్పుడు మూడో భాగంలో ఆయన నటనపై అభిమానుల్లో అంచనాలు పెరిగాయి. తెలుగు, హిందీ, తమిళం, మలయాళం భాషల్లో ఈ సిరీస్ అందుబాటులో ఉంటుంది.

చట్టమా? విశ్వాసమా?



యామీ గౌతమ్, ఇమ్రాన్ హష్మీ ప్రధాన పాత్రలు పోషించిన చిత్రం 'హక్'. ముస్లిం మహిళల హక్కుల పోరాటంలో మైలురాయిగా నిలిచిన 'మొహమ్మద్ అహ్మద్ ఖాన్ వర్సెస్ షా బానో బేగం' కేసు ఆధారంగా రాసుకున్న కథతో దర్శకుడు సుపర్ణ్ వర్మ ఎస్ తెరకెక్కించారు. నవంబర్ 7న ఈచిత్రం విడుదలవుతోంది. హర్మాన్ బవేజా, విశాల్ గుర్నాని నిర్మించారు. మేకర్స్ మంగళవారం ట్రైలర్‌ను విడుదల చేశారు. చట్టం, విశ్వాసం, న్యాయం మధ్య సంఘర్షణ ప్రధానాంశంగా దర్శకుడు కథను మలచిన తీరు ఆకట్టుకుంటోంది. షాబానో బేగం పాత్రలో యామీ గౌతమ్, ఆమె భర్తగా ఇమ్రాన్ హష్మీ తమదైన శైలిలో నటించి మెప్పించారు.

నటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ కావాలి



దేశవ్యాప్తంగా సినీ రంగంలో చర్చనీయాంశమైన పనివేళల అంశంపై కథానాయిక రష్మిక మందన్న స్పందించారు. వరుస పాన్ ఇండియా చిత్రాలతో బిజీగా ఉన్న రష్మిక తాను కూడా అధిక పని ఒత్తిడిని అనుభవిస్తున్నట్లు అంగీకరించారు. 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రం ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆమె మాట్లాడుతూ... రోజుకు పది పన్నెండు గంటలకు మించి పనిచేయడం ఎంత కష్టమో, కుటుంబ, వ్యక్తిగత జీవితానికి సమయం కేటాయించడం ఎంత అవసరమో ఆమె వివరించారు. 'నేను కూడా ఎక్కువగంటలు పనిచేస్తున్నాను. ఇది ఆరోగ్యానికి మంచిది కాదు. ఇలా చేయవద్దని అందరికీ చెబుతున్నాను. ఆఫీసులో ఉద్యోగులకు ఉన్నట్లే నటీనటులకూ ఎనిమిది గంటల షిఫ్ట్ ఉండాలి' అని రష్మిక అభిప్రాయపడ్డారు. ఒక షెడ్యూల్ పెట్టుకొని రోజుకు 8 గంటలు కంటినిండా నిద్రపోవాలి, వృత్తిని వ్యక్తిగత జీవితాన్ని బేలన్స్ చేసుకోవాలని ఆమె సూచించారు. నిర్ణీత పనివేళల డిమాండ్‌తో దీపికా పదుకొనే కొన్ని సినిమాల నుంచి వైదొలగిన్పటి నుంచి పలువురు నటీనటులు ఈ అంశంపై భిన్నాభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

నా కోసం ఆ వెన్నెల



ప్రేమలోని విభిన్న కోణాలను ఆవిష్కరిస్తూ తెరకెక్కిస్తోన్న చిత్రం 'ఓ చెలియా'. నాగప్రణవ్, కావేరి కర్ణిక, ఆద్య రెడ్డి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఇందిరా దేవి ప్రొడక్షన్స్ పతాకంపై రూపాశ్రీ కొపురు నిర్మిస్తున్నారు. ఎం. నాగ రాజశేఖర్‌రెడ్డి దర్శకుడు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. 'నా కోసం ఆ వెన్నెల' అంటూ సాగే ప్రేమగీతాన్ని నటుడు జేడీ చక్రవర్తి చేతుల మీదుగా మేకర్స్ విడుదల చేశారు. హీరో హీరోయిన్ల అనుబంధాన్ని వివరిస్తూ సాగే ఈ గీతానికి శివ సాహిత్యం అందించగా, ఎం.ఎం కుమార్ స్వరపరిచారు. మేఘన, మనోజ్ ఆలపించారు.

రెహమాన్ సంగీత విభావరి



ప్రముఖ సంగీత దర్శకుడు ఏ.ఆర్.రెహమాన్ తన సంగీత విభావరితో మరోసారి హైదరాబాద్ ప్రేక్షకులను అలరించబోతున్నారు. 'హైదరాబాద్ టాకీస్' ఆధ్వర్యంలో నవంబరు 8న రామోజీ ఫిలిం సిటీలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా తెలుగు ప్రేక్షకులతో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేస్తూ ' తెలుగు సినిమాలు చేస్తూనే పెరిగాను. 'ఏ మాయ చేశావే' మొదలు ఇటీవల రామ్ చరణ్ సినిమా వరకు ఇక్కడి ప్రేక్షకులు నన్ను ఎంతగానో ఆదరించారు. ఇప్పుడు హైదరాబాద్ ప్రజలు నా కచేరీని గొప్పగా ఆస్వాదిస్తారని భావిస్తున్నా.' అని అన్నారు. కచేరీలో తన బాణీల గురించి వివరిస్తూ 'నాకు పాత స్వరాలను అనుసరించే సమయం లేదు. కొత్త అనుభూతి కోసం 'రోజా' లాంటి క్లాసిక్స్‌ని డాల్బీ అట్మోస్‌లో రీమిక్స్ చేస్తున్నాను. ఇప్పుడు సంగీతం గ్లోబల్ అయిపోయింది. ఎవరు ఏ భాషలో ఆస్వాదిస్తున్నారో ఎవరూ చెప్పలేరు. సంగీతంలో కొత్తదనం, స్పష్టత ముఖ్యం. అది ప్రేరేపించే భావోద్వేగం అన్నింటి కంటే మరీ ముఖ్యం' అని వివరించారు. కాగా, 2017లో హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ భారీ కచేరీలో రెహమాన్ ప్రేక్షకులను 'మా తుజే సలామ్' పాటతో ఉర్రూతలూగించారు. మళ్లీ ఇన్నేళ్లకు సంగీత ప్రియులను అలరించబోతున్నారు.

‘మొంథా’ బీభత్సం

మొంథా తుఫాన్ ఉమ్మడి జిల్లాలో మంగళవారం బీభత్సం సృష్టించింది. భారీ ఈదురుగాలుల ధాటికి భారీ వృక్షాలు, కొబ్బరి చెట్లు వంటివి కూలిపోయాయి. విద్యుత్ స్తంభాలు విరిగి పడ్డాయి. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో తీవ్ర నష్టం వాటిల్లగా కాకినాడ జిల్లాలోను నష్టం నమోదైంది. ఎక్కడికక్కడ అధికార యంత్రాంగం అప్రమత్తమై వెంటనే సహాయక చర్యలు చేపట్టింది. కొన్నిచోట్ల ముందు జాగ్రత్తగా వృద్ధులను పునరావాస కేంద్రాలకు తరలించారు. అక్కడ వారికి భోజన ఏర్పాట్లు చేశారు.



అంబాజీపేట మండలం పుల్లేటికుర్రు ప్రధాన రహదారిలో విరిగిపడిన కొబ్బరిచెట్లు


అంతర్వేదిపల్లిపాలెంలో వృద్ధుడిని పునరావాస కేంద్రానికి తరలిస్తున్న ఎస్డీఆర్ఎఫ్ సిబ్బంది

కూలిన చెట్లు.. ఎప్పటికప్పుడు తొలగింపు

అమలాపురం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ గాలులకు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లావ్యాప్తంగా కూలిన చెట్లను అధికారుల ఆధ్వర్యంలో స్థానికుల సహాయంతో శరవేగంగా తొలగించారు. తుఫాన్ ప్రభావంతో వచ్చిన ఈదురుగాలుల ధాటికి కోనసీమలో భారీఎత్తున కొబ్బరి చెట్లు, రహదారుల వెంబడి భారీ చెట్లు చాలాచోట్ల కుప్పకూలిపోయాయి. వెంటనే తొలగించి రాకపోకలను పునరుద్ధరించడంలో వెంటనే చర్యలు చేపట్టారు. వీటికి భారీ క్రేన్లు, కటింగ్ మిషన్లు, కత్తులను వినియోగించారు. జొన్నాడ హైవేపై పడిన భారీ వృక్షాన్ని జాతీయ రహదారులశాఖ ఆధ్వర్యంలో తొలగింపు వేగవంతంగా జరిగింది. కోనసీమలో అనేకచోట్ల రహదారి మధ్యలో కూలిన వృక్షాలను పంచాయతీ సిబ్బంది వెంటనే తొలగించే ప్రక్రియను వేగవంతం చేశారు.


డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా జొన్నాడ సమీపంలో హైవేపై కూలిన వృక్షాలను తొలగిస్తున్న హైవే సిబ్బంది


అమలాపురం పట్టణం గాంధీనగర్‌లో కుప్పకూలిన విద్యుత్ స్తంభం


ఐ.పోలవరం మండలంలో వృద్ధుడిని పునరావాస కేంద్రానికి తరలిస్తున్న స్థానికులు


కొత్తపల్లి మండలం ఉప్పాడలోని పునరావాస కేంద్రంలో భోజనాలు వడ్డిస్తున్న దృశ్యం


యానాం భీమ్‌నగర్‌లో ఇంటిపై కూలిన చెట్టును తొలగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది


రాయవరం మండలం పసలపూడి రోడ్డులో కూలిన చెట్టును తొలగిస్తున్న స్థానికులు


పి.గన్నవరం: రాజవరం-పొదలాడ రహదారిపై చాకలిపాలెం వద్ద విరిగిపడిన చెట్టు తొలగింపు


ముమ్మిడివరం మండలం క్రాపచింతలపూడిపాలెం-పల్లవారిపాలెం రోడ్డులో కూలిన వృక్షం


ఉప్పాడ, ఆత్రేయపురంల్లోని పునరావాస కేంద్రాల్లో భోజనాలు చేస్తున్న వృద్ధులు


ఐ.పోలవరం మండలం భైరవపాలెంలో పరిస్థితిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుచ్చిబాబు, ఎంపీ హరీష్


కాజులూరు మండలం గొల్లపాలెంలో రోడ్డుపై కూలిన చెట్టును పరిశీలిస్తున్న మంత్రి సుభాష్


అంబాజీపేట మండలం చిందాదగరువులో ఇంటిపై కుప్పకూలిన వృక్షం


ఐ.పోలవరం మండలంలోని పునరావాస కేంద్రంలో వైద్యశిబిరం నిర్వహిస్తున్న దృశ్యం


ఏలేశ్వరం మండలం అప్పనపాలెం కాజ్‌వే పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ


మలికిపురంలో పునరావాస కేంద్రాన్ని సందర్శిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్


మలికిపురం మండలం గూడపల్లిలో రామాలయంపై పడిన చెట్టు

బైక్ సీటు కింద బుస్ బుస్...

తుని రూరల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలం రేఖవానిపాలెం సమీపంలో మంగళవారం మధ్యాహ్నం బైక్ సీటు కింద తాచుపాము కనిపించి భయపెట్టేసింది. తుని నుంచి విధులు నిర్వహించేందుకు కోటనందూరు పోలీస్ స్టేషన్‌కి వెళ్తున్న శివాజీ అనే కానిస్టేబుల్ బైక్ నుంచి ఒక్కసారిగా శబ్దం వచ్చింది. కింద నుంచి ఎవరో కొడుతున్నట్టు అనిపించింది. దీంతో శివాజీ బైక్ దిగి చూడగా ఏమీ కనిపించలేదు. అలా పరిశీలిస్తూ సీటు తెరిచిచూడగా తాచుపాము పడగ విప్పి కనిపించింది. ఊహించని ఈ పరిణామంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. శివాజీ ధైర్యంగా పామును స్థానికుల సాయంతో సమీపంలోని కొండ ప్రాంతంలో వదిలేశాడు.

పడగ విప్పి కూర్చున్న తాచుపాము


బుసలు కొడుతున్న పాము

బైక్‌పై తాచుపామును చూస్తున్న కానిస్టేబుల్ శివాజీ

ఎం.రావిలంకలో కొండచిలువ హతం


హతమైన కొండ చిలువ

దేవీపట్నం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం ఇందుకూరు పంచాయతీ ఎం.రావిలంక గ్రామంలోని ఒక ఇంట్లో మంగళవారం రాత్రి కొండ చిలువ హల్‌చల్ చేసింది. దీన్ని గమనించిన స్థానికులు భయభ్రాంతులకు గురై హతమార్చారు. ఈ కొండచిలువ పొడవు సుమారు 12 అడుగులవరకు ఉంటుందని స్థానికులు తెలిపారు.

సత్యదేవుడి సన్నిధిలో డీఎస్పీల జంట పూజలు

అన్నవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇద్దరు డీఎస్పీలు ప్రేమించి పశ్చిమ గోదావరి జిల్లాలో ఒక్కటైన జంట మంగళవారం కాకినాడ జిల్లా అన్నవరం సత్యదేవుడి సన్నిధిలో వ్రతమాచరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రస్తుతం కృష్ణాజిల్లా అవనిగడ్డ డీఎస్పీగా పనిచేస్తున్న విద్యశ్రీ, పల్నాడు జిల్లా గురజాల డీఎస్పీగా పనిచేస్తున్న జగదీష్‌లు గత కొంతకాలంగా ప్రేమించుకుంటున్నారు. ఇరుపెద్దల అంగీకారంతో వారు ఒక్కటయ్యారు. వారికి ఆలయ అధికారులు ఏర్పాట్లు చేయగా దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు. ఒకే క్యాడర్ గల అధికారుల ప్రేమవివాహం విశేషంగా మారింది.


వేదాశీర్వచనం పొందుతున్న డీఎస్పీల జంట

తుఫాన్ ఎఫెక్ట్ సత్యదేవుడి కానుకల లెక్కింపు వాయిదా

అన్నవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): సత్యదేవుడి సన్నిధిలో భక్తులు హుండీలలో సమర్పించిన కానుకలను ఈనెల 29న లెక్కించాలని నిర్ణయించారు. తుఫాన్ కారణంగా వాయిదా వేస్తున్నట్టు ఆలయ అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. త్వరలో కొత్తతేదీ వెల్లడిస్తామన్నారు.

తుఫాన్ ఈదురుగాలికి... సముద్రంలో మత్స్యకార యువకుడు గల్లంతు

కాకినాడ క్రైం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): మత్స్యకార యువకుడు కాకినాడ సముద్రంలో గల్లంతైన సంఘటన మంగళవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళితే... కాకినాడ దుమ్ములపేటకు చెందిన గద్దేపల్లి సాయి రాం (21) కు భార్య, కుమారుడు ఉన్నారు. కాగా అతడు చేపల వేట చేస్తూ జీవనం సాగిస్తుంటాడు. వేట సాగించే బోటును వేట అనంతరం కుంభాభిషేకం వద్ద నిలిపాడు. తుఫాను కారణంగా ఈదురుగాలులు తీవ్ర రూపం దాల్చడంతో ఆ బోటు అక్కడ ఉండడం శ్రేయస్కరం కాదని భావించి ఏటిమొగలోని కల్వర్ట్ వద్ద బోటును నిలుపుదామనుకున్నాడు. ఈ క్రమంలో బోటుకు వేసిన లంగర్‌ను లాగుతుండగా ఒక్కసారిగా విరుచుకుపడిన రాకాసి అలతో పాటు వేగంగా వీచిన ఈదురుగాలికి సాయిరాం సముద్రంలో పడి గల్లంతయ్యాడు. వెంటనే గాలింపు చర్యలు చేపట్టినా యువకుడి ఆచూకీ లభ్యం కాలేదు. పోర్టు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



సాయిరామ్ (ఫైల్)

కాలువలో గల్లంతైన బాలుడి కోసం ఎస్డీఆర్ఎఫ్ బృందం గాలింపు

సర్పవరం జంక్షన్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ సూర్యారావుపేట పర్ర కాలువలో కాకినాడ మధురానగర్‌కి చెందిన 11 ఏళ్ల పోలవరపు చరణ్‌సాయి రిత్విక్ సోమవారం గల్లంతైన సంగతి తెలిసిందే. మంగళవారం ఎస్డీఆర్ఎఫ్ బృందం ఆధ్వర్యంలో పర్ర కాలువ, సముద్రంలో గాలింపు చర్యలు చేపట్టినట్టు తిమ్మాపురం ఎస్ఐ వై.గణేష్‌కుమార్ తెలిపారు. తుఫాన్ ప్రభావంతో సముద్రం అల్లకల్లోలంగా ఉందని, ఇది గాలింపు చర్యలపై ప్రతికూల ప్రభావం చూపుతోందన్నారు. బుధవారం గాలింపు చర్యలు కొనసాగిస్తామన్నారు. కుమారుడి ఆచూకీ కోసం తల్లిదండ్రులు రమణ, దుర్గాభవాని, మేనమామ కొప్పిశెట్టి శ్రీనివాస్, ఇతర కుటుంబసభ్యులు ఎదురుచూస్తున్నారు.


చరణ్ (ఫైల్)

‘ఏలేరు’ నుంచి 5వేల క్యూసెక్కుల నీరు విడుదల


జలాశయం గేట్ల నుంచి విడుదలవుతున్న నీరు

ఏలేశ్వరం/పిఠాపురం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ఏలేశ్వరంలో ఏలేరు రిజర్వాయర్ నుంచి 5వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. వర్షాలకు జలాశయం పరివాహక ప్రాంతం నుంచి 5175 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరడంతో ఆశించిన స్థాయిలో నీటి నిల్వలు పెరిగే అవకాశం ఉంది. ప్రాజెక్టులో మరో 2 టీఎంసీలు నీటిని నిల్వ చేసే అవకాశం ఉంది. దీంతో ప్రాజెక్టులో మంగళవారం నాటికి 86.56 మీటర్లకుగాను 85.39 మీటర్లు, 24.11 టీఎంసీలకు 21.74 టీఎంసీలు చేరుకున్నాయి. దీంతో విశాఖకు 175 క్యూసెక్కులు, దిగువ ప్రాంతాలకు 5వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. అయితే రిజర్వాయర్ నుంచి 5వేల క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నట్టు చెప్తున్నా మంగళవారం సాయంత్రం గొల్లప్రోలు, పిఠాపురం మండలాల పరిధిలోని ఏలేరు కాలువల్లో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తే ఇది మరింత ఎక్కువ ఉండవచ్చని చెప్తున్నారు. గతంలో చెప్పిన దాని కంటే రెట్టింపు నీటిని విడుదల చేసి పొలాలను ముంచివేశారని, ఇప్పుడూ అలాగే చేస్తున్నారా అని ప్రశ్నించారు. ఈ సందేహాలు సరికాదని ఏలేరు అధికారులు స్పష్టం చేస్తున్నారు. రిజర్వాయర్‌ను ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ సందర్శించి అధికారులను అప్రమత్తం చేశారు. ఏలేశ్వరం- అప్పనపాలెం మధ్య ఏలేరు ప్రధాన కాలువపై కుంగిన కాజ్‌వేను పరిశీలించి ప్రజలు రాకపోకలకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

లారీ ఢీకొని బాలుడి మృతి


మృతిచెందిన బాలుడు జాన్‌వెస్లీ

దివాన్‌చెరువు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా రాజానగరం పోలీస్ స్టేషన్ పరిధిలో శ్రీకృష్ణపట్నం - భూపాలపట్నం మధ్య మంగళవారం లారీ ఢీకొని పాతతుంగపాడుకు చెందిన నాగులాపల్లి జాన్‌వెస్లీ (14) అనే బాలుడు మృతిచెందగా, బోయిడి దుర్గాప్రసాద్ అనే మరో బాలుడు స్వల్పంగా గాయపడ్డాడు. రాజానగరం ఎస్ఐ నారాయణమ్మ తెలిపిన వివరాల ప్రకారం.. జాన్‌వెస్లీ తన స్నేహితుడు దుర్గాప్రసాద్‌తో కలిసి బైక్‌పై వెళ్తున్నాడు. వారిని శ్రీకృష్ణపట్నం - భూపాలపట్నం మధ్య క్వారీ లారీ ఢీకొంది. బైక్‌పై వెనక కూర్చున్న జాన్‌వెస్లీ అక్కడికక్కడే మృతిచెందాడు. బైక్ నడుపుతున్న దుర్గాప్రసాద్‌కు స్వల్పగాయాలయ్యాయి. జాన్‌వెస్లీ మృతదేహాన్ని శవపరీక్ష నిమిత్తం రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు. జాన్‌వెస్లీ ద్వారపూడిలోని ఒక ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడని బంధువులు తెలిపారు.

కారు ఢీకొని విశ్రాంత ఎంపీహెచ్‌ఈవో మృతి


మృతి చెందిన ముక్తేశ్వరరావు

ఎటపాక, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని రిటైర్డ్ ఎంపీహెచ్‌ఈవో చిలుకూరి ముక్తేశ్వరరావు (63) అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన అల్లూరి జిల్లా ఎటపాక మండలం పురుషోత్తపట్నం సమీపంలో జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నెల్లిపాక గ్రామానికి చెందిన ముక్తేశ్వరరావు చింతూరు మండలం తులసిపాక వీహెచ్‌సీలో ఎంపీహెచ్‌వోగా విధులు నిర్వర్తించి గత నెలలో విరమణ పొందారు. మంగళవారం రాత్రి మోటారు సైకిల్‌పై భద్రాచలం వైపు వెళ్తున్న క్రమంలో పురుషోత్తపట్నం వద్దకు రాగానే వెనుక వైపు నుంచి వస్తున్న షిఫ్ట్ కారు ఢీకొనడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. ఢీకొన్న కారు ఆపకుండా వెళ్లిపోయింది. ఎస్ఐ జి.అప్పలరాజు కేసు నమోదు చేశారు.

సామర్లకోటలో వందేళ్ల నాటి శిథిల భవనం కూల్చివేత


సామర్లకోటలో శిథిల భవనం కూల్చివేస్తున్న దృశ్యం

సామర్లకోట, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సామర్లకోట పట్టణ నడిబొడ్డున వందేళ్ల నాటి భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరి ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఏర్పడింది. మొంథా తుఫాన్ ప్రభావం భయానక పరిస్థితుల కారణంగా కూల్చివేశారు. పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప స్పందించి మున్సిపల్ అధికారులతో తక్షణం కూల్చి వేయాలని ఆదేశించడంతో మంగళవారం సాయంత్రం క్రేన్ సహాయంతో కూల్చివేత పనులు నిర్వహించారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని మహిళ మృతి


మృతిచెందిన మహిళ

ఆలమూరు, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చొప్పెల్ల వద్ద జాతీయ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ అక్కడికక్కడే మృతిచెందింది. ఆలమూరు ఎస్ఐ జి.నరేష్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశా రాష్ట్రానికి చెందిన కిలా రమ (40) సోమవారం ఉదయం చొప్పెల్లలోని తోరాటి సుబ్రహ్మణ్యం ఇటుకబట్టీలో పనిచేయడానికి వచ్చింది. ఆమె కుమారుడు మరో బట్టీలో పనిచేస్తుండడంతో అక్కడికి వెళ్లి రాత్రి 7 గంటల సమయంలో తిరిగి వస్తుండగా రాజమహేంద్రవరం నుంచి రావులపాలెం వైపు వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీ కొని అక్కడిక్కడే మృతిచెందింది. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ నరేష్ తెలిపారు.

తల్లీబిడ్డ మృతిపై జాతీయ ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు

రంపచోడవరం, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ఇటీవల అల్లూరి జిల్లా రంపచోడవరం ఏరియా ఆసుపత్రిలో వైద్యుల నిర్లక్ష్యంతో తల్లీబిడ్డ మృతి చెందిన ఘటనపై జాతీయ ఎస్టీ, మహిళా, మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినట్టు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను తెలిపారు. సంఘటనపై త్వరలో ఏరియా ఆసుపత్రిని ముట్టడించనున్నామని, గిరిజన ప్రాంత ప్రజలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.

అప్రమత్తంగా ఉండాలి

పి.గన్నవరం,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ తీవ్రత కారణంగా ప్రజలందరూ అప్రమత్తతో ఉండాలని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం పి.గన్నవరంలోని తుఫాను షెల్టరులో బాధితులకు భోజనాలు పంపిణీ చేశారు. తాటాకిళ్లు, రేకులషెడ్లల్లో ఉన్నవారు తుఫాన్ షెల్టర్లకు రావాలని ఎమ్మెల్యే కోరారు.

మంత్రి ఓడలరేవు సందర్శన

అల్లవరం,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి):తుఫాన్ ప్రభావంతో ప్రాణ,ఆస్తి నష్టం జరగకుండా చూడాలంటూ మంత్రి అచ్చెన్నాయుడు అధికారులకు సూచనలిచ్చారు. ఎంపీ జి.హరీష్, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు, టీడీపీ, బీజేపీ నాయకులతో కలిసి ఓడలరేవు పునరావాస కేంద్రాన్ని, ఓఎన్జీసీటెర్మినల్ చివర సాగర తీరాన్ని పరిశీలించారు.

మొంథా తుఫాన్‌తో కోనసీమ కలవరం

- నేల కూలిన చెట్లు, విద్యుత్ స్తంభాలు
- వరి, అరటి పంటకు నష్టం



మామిడికుదురు: ఆదుర్రులో మహిళలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ

ముమ్మిడివరం, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ కారణంగా మంగళవారం ఉదయం నుంచి గాలులతో పాటు వర్షం పడుతూనే ఉంది. మండల పరిధిలో 700తాటాకిళ్లు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. 509కుటుంబాలకు చెందిన 1226మందిని 18పునరావాస కేంద్రాలకు తరలించారు. మండలంలో భారీగా వీస్తున్న గాలుల తీవ్రతకు మండలంలో 15వరకు విద్యుత్ స్తంభాలు నేలకూలాయి. అనాతవరంలో వనచర్ల బాలయ్య డాబాపై కొబ్బరిచెట్టు పడింది. అయితే ఎవరికీ ఏవిధమైన ప్రమాదం జరగలేదు. వర్షం, గాలుల కారణంగా మండలంలో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేశారు. మండల ప్రత్యేకాధికారి పి.గౌతమ్, తహశీల్దార్ టి.సుభాష్, ఎంపీడీవో దీక్షితులు పునరావాస కేంద్రాలను పరిశీలించి ప్రజలను అక్కడికి తరలిరావాలని సూచించారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి షాపులు మూసివేశారు. వాహనాలు, ఆటోలు, ఆర్టీసీ సర్వీసులు తిరగడం లేదు. ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు అమలాపురం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో తుఫాన్ సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్, వ్యవసాయశాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి అచ్చెన్నాయుడుతో జరిగిన సమీక్షా సమావేశంలో నియోజకవర్గ పరిస్థితులపై వివరించారు.

వణికిస్తున్న మొంథా తుఫాన్

అయినవిల్లి, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతాల్లో బలమైన ఈదురుగాలులు వీస్తుండడంతో చెట్లు నేలకొరుగుతున్నాయి. విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. అధికారులు నదీ తీర లంక గ్రామాల్లోని తాటాకిళ్లలో నివశించే వారిని పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. గాలులు, భారీవర్షాలకు జన జీవనం స్తంభించింది. ఈదురుగాలులకు వరి పంట నేలనంటడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

విరిగిపడిన విద్యుత్ స్తంభాలు

పి.గన్నవరం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో వీచిన ఈదురుగాలులకు మండల వ్యాప్తంగా పలు చోట్ల కొబ్బరి, మామిడి, పలురకాలు చెట్లు విరిగిపడ్డాయి. భారీ వృక్షాలు ప్రధాన రహదారులపై కుప్పకూలాయి. రాజవరం-పొదలాడ రహదారిలో చాకలిపాలెం, నాగుల్లంక వద్ద భారీ వృక్షాలు ప్రధాన రహదారిపైవిరిడిపడ్డాయి.యర్రంశెట్టివారిపాలెం ప్రధాన రహదారిపై భారీ మామిడిచెట్టు విరిగిపడింది. దీంతో ఎస్ఐ బి.శివకృష్ణ, రెవెన్యూ, పంచాయతీ సిబ్బంది చెట్లు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కె.ఏనుగుపల్లి ఏటిగట్టుపై భారీ వృక్షం కుప్పకూలడంతో రెవెన్యూపంచాయతీ సిబ్బంది చెట్టును తొలగించారు. కె.ఏనుగుపల్లి, నరేంద్రపురం గ్రామాల్లో కొబ్బరి చెట్లు నివాసగృహాలపై పడ్డాయి. విద్యుత్‌శాఖ ఏఈ ఆచార్యులు ఆధ్వర్యంలో వరిగిన, కుప్పకూలిన విద్యుత్ స్తంభాలను తొలగించి నూతన స్తంభాలు ఏర్పాటు చేస్తున్నారు. పి.గన్నవరం, అంబాజీపేట, అయినవిల్లి మండలాల్లో 154 పునరావాస కేంద్రా లకు 2044మందిని తరలించామని నియోజకవర్గ ప్రత్యేక అధికారి టి.జయచంద్రగాంధీ తెలిపారు.

స్వీట్ తయారీ కేంద్రంలో ఘటన

నరేంద్రపురంలో ఉన్న మారుతిస్వీట్స్ తయారీ కేంద్రంలో మండుతున్న ఊకపొయ్యిపై కొబ్బరి చెట్టు పడింది. ఆ సమయంలో అక్కడ నలుగురు స్వీట్స్ తయారుచేస్తున్నారు. పొయ్యిపై కాగుతున్న నూనె ఉంది. అయితే కొబ్బరి చెట్టు పడుతున్నట్టు శబ్దం రావడంతో చెట్టు పడకముందే వారు అక్కడ నుంచి వెళ్లిపోయారు. దీంతో వారికి ఎటువంటి ప్రమాదం జరగలేదు.

ఇంటి నుంచి బయటకు రావద్దు

మామిడికుదురు,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ దృష్ట్యా అవసరమైతే తప్ప ఎవరూ ఇంటి నుంచి బయటకు రావద్దని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ సూచించారు. ఎమ్మెల్యే మంగళవారం ఆదుర్రు, పాశర్లపూడి, పాశర్లపూడిలంక తదితర ప్రాంతాల్లో పర్యటించి లోతట్టు ప్రాంతాల్లో ఉన్న ప్రజల ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. తుఫాన్ ప్రభావంతో వీస్తున్న భారీ ఈదురుగాలులకు కొబ్బరి, తాడి చెట్లతో పాటు విద్యుత్ స్తంభాలు నేలకొరుగుతున్నాయి. మాకనపాలెంలో తాడిచెట్టు పడి మహిళ మృతిచెందగా, నగరం గ్రామంలో ఇంటి బయట ఆడుకుంటున్న బాలుడు మందపాటి ప్రవీణ్(15)పై తాడిచెట్టు పడడంతో తీవ్రగాయాలు కావడంతో 108లోకాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. నగరం మారుతీ షోరూం వద్ద కొబ్బరిచెట్టు విద్యుత్ తీగలపై పడడంతో తీగలు తెగి పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై పడింది. పాశర్లపూడిలో బయటపెట్టిన ఆటోలపై భారీ వృక్షం పడగా అవి దెబ్బతిన్నాయి. కొమరాడలో కొబ్బరిచెట్టు విద్యుత్ తీగలపై పడడంతో విద్యుత్ తీగలతో పాటు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై పడిపోయింది.

ఇళ్లకు చేరే వరకూ సేవలు

అల్లవరం అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌కు పునరావాస కేంద్రాల్లో తలదాచుకున్న బాధితులు ఇళ్లకు చేరే వరకు అధికారులు సహాయక చర్యలు చేపట్టాలని, ప్రభుత్వం వారికి అండగా నిలుస్తుందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. ఓడలరేవు తుఫాన్ పునరావాస కేంద్రాన్ని మంగళవారం పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.కొమరగిరిపట్నం, ఓడలరేవు, బోడసకుర్రు తదితర గ్రామాల్లో వేప, మామిడి, చింతా భారీ వృక్షాలు నేలకూలాయి. డి.రావులపాలెం, కొమరగిరిపట్నం, బెండమూర్లంక, కోడూరుపాడు, ఓడలరేవు గ్రామాల్లో 50 విద్యుత్ స్తంభాలు భారీగాలులకు నేలకూలాయని, సిబ్బంది సహాయక చర్యల్లో నిమగ్నమయ్యారని అల్లవరం ట్రాన్స్‌కో ఏఈ బి.వెంకటేశ్వరరావు తెలిపారు. విద్యుత్ స్తంభాలు పడిపోవడంతో పలు గ్రామాల్లో అంధకారం నెలకొంది.




ఉప్పలగుప్తం: పేరాయిచెరువు పాఠశాల భవనంలో వృద్ధులతో మాట్లాడుతున్న దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ,
అల్లవరం: అల్లవరం ఓడలరేవు పునరావాస కేంద్రంలో బాధితులకు ఎమ్మెల్యే ఆనందరావు సూచనలు

ఆందోళన వద్దు

ఐ.పోలవరం, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి):తుఫాను తీవ్రతపై ఎవరూ ఆందోళన చెందవద్దని, ఎంతటి విపత్తునైనా ఎదుర్కొనేందుకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, ఎంపీ గంటి హరీష్‌మాధుర్ అన్నారు. తీరగ్రామం భైరవపాలెంలో మంగళవారం వారు పర్యటించారు. భైరవపాలెం సముద్రం మొగ వద్ద తుఫాన్ తీవ్రతను పరిశీలించారు. గ్రామంలోని పునరావాస కేంద్రాన్ని సందర్శించి ఏర్పాట్లపై అధికారులను ఆరా తీశారు.

భైరవపాలెం కేంద్రంలో అరకొర సౌకర్యాలు

భైరవపాలెం పునరావాస కేంద్రంలో అరకొర సౌకర్యాలు కల్పించారంటూ బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఉదయం వారికి అల్పాహారం వంటిసౌకర్యాలు కల్పించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్నం కొంత మందికి మాత్రమే భోజనాలు పెట్టారని మండిపడ్డారు. భైరవపాలెం, ఎదుర్లంక, జి.మూలపొలం, కేశనకుర్రు, ఐ.పోలవరం గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేసి, 350మందిని తరలించినట్టు తహసీల్దార్ విజయశ్రీ తెలిపారు.

తీర ప్రాంతం వణుకు

మలికిపురం, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ మండలం తీర ప్రాంతాన్ని గడగడలాడించింది. మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు, కొబ్బరిచెట్లు నేలకొరిగాయి. మండలంలో ఆరు పునరావాస కేంద్రాల్లో 228 మంది ఉన్నట్టు తహశీల్దార్ టి.శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ స్తంభాలు పడిపోయినచోట వెంటనే కొత్త స్తంభాలు ఏర్పాటు చేస్తున్నట్టు ఎలక్ట్రికల్ ఏఈ బి.ప్రసాద్ తెలిపారు. గొల్లపాలెంలోని ముంపు ప్రాంతాన్ని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, టీడీపీ ఇన్‌చార్జి అమూల్య, కూటమి నాయకులు పరిశీలించారు. కేశనపల్లి, తూర్పుపాలెంలో పునరావాస కేంద్రాలను సందర్శించి ఆశ్రయులకు అన్ని సౌకర్యాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రాజోలు, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో ఉదయం నుంచి ఎడతెరిపి లేకుండా ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం మంగళవారం కురిసింది. మండలంలో 16పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశామని డీఎల్పీవో ప్రత్యేకాధికారి పి.బొజ్జిరాజు, తహశీల్దార్ సీహెచ్ భాస్కర్ తెలిపారు. భారీ ఈదురుగాలులకు ఆయా గ్రామాల్లోని కొబ్బరిచెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరుగుతున్నాయి. చింతలపల్లిలో ప్రధాన రహదారి పక్కన ఉన్న విద్యుత్ తీగలపై కొబ్బరిచెట్టు విరిగి పడింది. రాజోలు జాతీయ రహదారి 216 పోలీసుస్టేషన్ సమీపంలో ఉన్న భవనంపై ఈదురుగాలులకు భారీ వృక్షం నేలకూలింది. ప్రత్యేకాధికారి బొజ్జిరాజు, తహశీల్దార్ భాస్కర్‌తో కలిసి శివకోడు, చింతలపల్లి, కడలి పొన్నమండ, కాట్రేనిపాడుగ్రామాల్లో పర్యటించారు.

సురక్షిత ప్రాంతాలకు వలస మత్స్యకారులు

కాట్రేనికోన, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): గచ్చకాయలపొరలో ఉన్న 200మంది వలస మత్స్యకారులను మంగళవారం ముమ్మిడివరం సీఐ మోహన్‌కుమార్, కాట్రేనికోన ఎస్ఐ అవినాష్ ఎంపీడీవో ఎస్వీ చలం గ్రామంలోని తుఫాను షెల్టర్‌కు తరలించారు. మంగళవారం గాలుల కారణంగా మండలంలో ఎన్నోచెట్లు దారికడ్డంగా ఒరిగిపోయాయి. కొన్నిచోట్ల ఇళ్లపై పడ్డాయి. గాలులు, వర్షం భయంతో జనం బయటకు రాలేని పరిస్థితి. కాట్రేనికోనకు చెందిన పీఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో పలువురు యువకులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చారు. రంపాలు, ఇతర రకాల సామగ్రితో ముందుకు వచ్చారు. ఎక్కడ చెట్టు కూలినా వెంటనే దానిని రహదారి నుంచి తొలగిస్తున్నారు.తుఫానుతో మండలంలో జనజీవనం స్తంభించింది. గచ్చకాయలపొర పునరావాస కేంద్రంలో362మందికి, బలుసుతిప్పలో 162మందికి, కందికుప్పలో 98మందికి, చిర్రయానాంలో 200 మందికి, కొప్పిగుంటలో 35మందికి దొంతికుర్రులో 100మందికి, పల్లంలో20మందికి, ఉప్పాడిలో80మందికి అల్పాహారంఏర్పాటుచేశారు.

అల్లకల్లోలంగా అంతర్వేది సముద్రం

అంతర్వేది, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ నేపథ్యంలో అంతర్వేది సముద్రం అల్లకల్లోలంగా మారింది.అంతర్వేది, అంతర్వేదిదేవస్థానం పరిసర ప్రాంతాలకు రక్షణగోడ ఏర్పాటు చేసినా కెరటాలు ఉవ్వెత్తునఎగిసిపడి తీర ప్రాంతం కోతకు గురవుతూ సముద్రపునీరు లైట్‌హౌస్ గోడలను తాకాయి. మంగళవారం మధ్యాహ్నం నుంచి విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో సఖినేటిపల్లి మండలంలోనికొన్నిగ్రామాలు అంధకారంలో ఉన్నాయి. అంతర్వేది దండుపుంత రోడ్డు నుంచి గుడికి వెళ్లే రహదారి పూర్తిగా నీట మునిగింది. ఈరోడ్డులో ఉన్న స్వామివారి సోదరి అశ్వరూడాంబిక ఆలయం ముంపు నీటిలో ఉంది. అక్వా చెరువులు,

తుఫాన్‌పై పుదుచ్చేరి సీఎం ఆరా

యానాం, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ యానాం వైపు దూసుకొస్తున్న నేపథ్యంలో యానాం నియోజకవర్గం పరిధిలోని తుఫాన్ పరిస్థితిపై పుదుచ్చేరి సీఎం ఎన్.రంగసామి ఆరా తీశారు. యానాం-కాకినాడ మధ్య తుఫాన్ తీరం దాటే అవకాశం ఉన్నందున్న ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సీఎం రంగసామి, ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు కోరారు. పుదుచ్చేరి నుంచి సీఎం రంగసామి మల్లాడికి ఫోన్ చేసి తుఫాన్ పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. యానాంలో పాలనాపరంగా తీసుకున్న చర్యలు, పరిపాలనాధికారి, పుదుచ్చేరి నుంచి వచ్చిన ప్రత్యేకాధికారి, ఇతర సిబ్బందితో సమీక్షించిన అంశాలను మల్లాడి సీఎంకు వివరించారు. తుఫాన్ విషయంలో ప్రభుత్వం అన్నిచర్యలు తీసుకుంటుందని సీఎం పేర్కొన్నారు.

నేలకొరిగిన వృక్షాలు

అమలాపురం రూరల్, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో వీస్తున్న ఈదురుగాలులకు అమలాపురం పట్టణ పరిసర గ్రామాల్లో వృక్షాలు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. అమలాపురం కిమ్స్ వైద్య కళాశాల సమీపంలో కొబ్బరిచెట్టు విరిగిపడి జాతీయ రహదారిపై పడటంతో కొద్దిసేపు ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. స్థానిక గాంధీనగర్‌లో విద్యుత్ స్తంభం విరిగిపడింది. చిందాడగరువులో భారీ వృక్షం ఇంటిపై పడింది. ఎవరికిఎటువంటి హాని జరగలేదు. బండారులంక, కాపటివీధి, ఎగ్జిబిషన్ సెంటర్లలో కొబ్బరిచెట్లు, విద్యుత్ స్తంబాలు విరిగిపడిపోయాయి.మండలంలో 22పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశారు. పలు పునరావాస కేంద్రాలకు స్థానికులు వచ్చేందుకు నిరాకరించారు.



యానాం: దరియాలతిప్ప జెట్టి వద్ద స్థానిక మత్స్యకారులతో మాట్లాడుతున్న ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు

ప్రజల రక్షణకు కదిలిన కూటమి దండు

ఉప్పలగుప్తం, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మండలంలో కూటమి నాయకులు, కార్యకర్తలు మొంథా తుఫాను నుంచి ప్రజలను రక్షించే చర్యలు చేపట్టారు. టీడీపీ నాయకుడు, స్టేట్ ఆక్వా డైరెక్టర్ దేశంశెట్టి వెంకటలక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన నాయకులు మంగళవారం గ్రామాల్లో శిథిలగృహాలు,తాటాకిళ్ల,రేకుల షెడ్లు గుర్తించి, గ్రామాలవారీగా ఆ కుటుంబాలను కలిసి తుఫాన్ తీరం దాటే వరకు తాము ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు రావాలని కోరారు. తోటల్లో నివసిస్తున్న వారిని, పొలాల్లో ఉంటున్న వారిని వాహనాలపై పునరావాస కేంద్రాలకు తీసుకువచ్చారు. ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల భవనాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. రెవెన్యూ, ఇతర శాఖల అధికారుల సమన్వయంతో కేంద్రాల్లో ఉన్న వారికి భోజన వసతి కల్పించారు. పునరావాస కేంద్రాల్లో 2,000మందికి రక్షణ కల్పించారు. గొల్లవిల్లి హైస్కూల్‌లో ఏర్పాటుచేసిన పునరావాస కేంద్రంలో అమ్మసిల్క్స్ అధినేత శ్యామ్ సమకూర్చిన రగ్గులను టీడీపీ మండలాధ్యక్షుడు అరిగెల నానాజీ వృద్ధులకు పంపిణీ చేశారు. .

రవ్వ యాజమాన్యం తుఫాన్ అలర్ట్

ఉప్పలగుప్తం, అక్టోబరు28(ఆంధ్రజ్యోతి):ఎస్.యానాంలో చమురు, సహజ వాయువుల ఉత్పత్తి సంస్థరవ్వ యాజమాన్యం మొంథాతుఫాన్‌పై అప్రమత్తమైంది. ఎస్.యానాం సముద్రంలో చమురు ఉత్పత్తి చేస్తున్న రవ్వ ప్లాంటు ప్రతి రోజూ షిఫ్టుల ప్రకారం 20నుంచి 30మంది టెక్నికల్ సిబ్బందిని హెలికాప్టర్‌లో ఆఫ్‌షోర్‌కు తరలించి అక్కడున్న సిబ్బందిని ఆన్‌షోర్‌కు చేరుస్తుంది. తుఫాను హెచ్చరికల నేపథ్యంలో ఆఫ్ షోర్‌లోని సిబ్బందిని పూర్తిగాఆన్‌షోర్‌కు రప్పించారు. రవ్వసిబ్బంది క్వార్టర్స్ జలదిగ్బంధంలో ఉన్నాయి.

ముంపు నీటిలో పంటలు

అంబాజీపేట,అక్టోబరు28(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో ప్రజలంతా సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని డీఆర్‌డీఏ పీడీ, నియోజకవర్గ ప్రత్యేకాధికారి జయచంద్రగాంధీ సూచించారు. మండలంలోని పునరావాస కేంద్రాలను పరిశీలించారు. నియోజకవర్గంలో 208పునరావాస కేంద్రాలు ఏర్పాటుచేశామని, ఆయా కేంద్రాల్లో అన్నిసౌకర్యం కల్పించామ న్నారు. కె.పెదపూడి ప్రధాన రహదారిలో ఓ డాబాపై భారీ వృక్షం నేలకొరిగింది. మండలంలో వరిచేలు, కొబ్బరి, అరటితోటలు ముంపునీటిలో ఉన్నాయి.

తుఫాన్ నష్టం లేకుండా ముందస్తు చర్యలు తీసుకున్నాం

- పునరావాస కేంద్రాలను పరిశీలించిన మంత్రి సుభాష్ • ఏర్పాట్లపై ఎమ్మెల్యేలు, అధికారులు సంతృప్తి



కె.గంగవరం: పామర్రులోని పునరావాస కేంద్రంలో బాధితులకు బిస్కెట్ కిట్లు అందజేస్తున్న మంత్రి సుభాష్

కె.గంగవరం, అక్టోబరు 28(ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా ఆస్తి, ప్రాణనష్టం వాటిల్లకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ అన్నారు. మంగళవారం ఆయన పామర్రు, అముజూరు, కూళ్ల గ్రామాల్లో పర్యటించి పునరావాస కేంద్రాలను పరిశీలించారు. పునరావాస కేంద్రంలో తలదాచుకుంటున్న వారికి బ్రెడ్, బిస్కట్‌లు పంపిణీ చేశారు. వారికి ఏవిధమైన లోటు రాకుండా చూసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఆయన వెంట జనసేన పార్టీ ఇన్‌చార్జ్ పోలిశెట్టి చంద్రశేఖర్, టీడీపీ సీనియర్ నాయకులు వాసంశెట్టి సత్యం, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ సలాది రమేష్ తదితరులతో పాటు తహశీల్దార్ శ్రీరామప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కూలిన చెట్లు: తుఫాను కారణంగా వీస్తున్న ఈదురు గాలులకు ఊడిమూడి ఎస్సీకాలనీకి వెళ్లే దారితో పాటు, కోట గ్రామంలోని శివాలయం ఎదురుగా ఉన్న వీధిలో చెట్లుపడిపోయాయి. బాలాంత్రంలో విద్యుత్ స్తంభాలు పడిపోయాయి. ఊడిమూడిలో చెట్లను తొలగించగా, బాలాంత్రంలో విద్యుత్ స్తంభాలను పునరుద్ధరించారు. తామరపల్లి, శివల గ్రామాల్లోను చెట్లు పడిపోయాయి. అధికార యంత్రాంగం లోతట్టు, గుడిసెల్లోని ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించారు. ఆయా గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో రక్షిత మంచినీటి ట్యాంకుల వద్ద జనరేటర్‌లను ఏర్పాటు చేసి తాగునీటిని సరఫరా చేశారు. మండల పరిషత్ కార్యాలయం అధికారి సురేంద్రనాథ్ రెడ్డి, తహశీల్దార్ శ్రీరామప్రసాద్, స్వచ్ఛభారత్ కార్పొరేషన్ డైరెక్టర్ సలాది రమేష్, టీడీపీ మండల అధ్యక్షుడు మేడిశెట్టి రవికుమార్, యర్రపోతవరం డీసీ అధ్యక్షులు నిడదవోలు సుబ్రహ్మణ్యేశ్వరరావు పునరావాస కేంద్రాల్లోని వారికి అందుతున్న సదుపాయాలను పరిశీలించారు.

లంకలో చిక్కుకున్న 8 మందిని సురక్షిత ప్రాంతానికి తరలింపు: కోట గ్రామానికి చెందిన పశువుల కాపరులు తుఫాన్ హెచ్చరికలను పట్టించుకోకుండా గొర్రెలు, మేకలను మేపుకోవడానికి మంగళవారం ఉదయమే లంకలోకి వెళ్లారు. దీంతో తుఫాను తీవ్రత తెలుసుకున్న వారి కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని వీఆర్‌వో తీపర్తి బాలాజీకి తెలుపగా, ఆయన తహశీల్దార్ శ్రీరామప్రసాద్ సమాచారం ఇచ్చారు. దీంతో తహశీల్దార్ శ్రీరామప్రసాద్, ఆర్ఐ వెంకట్రావు, ఫిషరీస్ అధికారి డేవిడ్‌రాజులను ఇంజన్ నావ, లైఫ్ జాకెట్‌లతో లంకలోకి పంపించారు. అక్కడున్న ఎనిమిది మందిని సురక్షితంగా తీసుకువచ్చి వారి ఇళ్లకు పంపించారు.

పునరావాస కేంద్రాలను వినియోగించుకోవాలి
ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

కపిలేశ్వరపురం(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ప్రజలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు కోరారు. మంగళవారం టేకి, వల్లూరు గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను ఆయన పరిశీలించి వారితో మాట్లాడారు. వైద్య శిబిరాలను ఆయన పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. కేదార్లంక గ్రామాల్లో ముంపు ప్రభావిత ప్రాంతాల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటిపారుదల అభివృద్ధి సంస్థ చైర్మన్ వేగుళ్ళ లీలాకృష్ణ పర్యటించారు. తీర ప్రాంతంలో రక్షణ చర్యలు, ప్రస్తుత పరిస్థితులపై అధికారులతో సమీక్షించారు. ప్రజలకు అవసరమైన మందులు, సదుపాయాలను ఆయన తనిఖీ చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ నాయకులు వల్లూరి వీరబాబు, ముత్యాల శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఆర్డీవో అఖిల పర్యటన: మండలంలోని ఆయా గ్రామాల్లో మంగళవారం రామచంద్రపురం ఆర్డీవో అఖిల, తహసీల్దార్ జి.శ్రీనివాస్, ఎంపీడీవో భానూజీరావు, తదితర అధికారులతో పర్యటించారు. వల్లూరు, వెదురుమూడి తదితర గ్రామాల్లోని పునరావాస కేంద్రాలను పరిశీలించి మందులను తనిఖీ చేశారు. కపిలేశ్వరపురం శివారులో కొబ్బరిచెట్టు విరిగిపడింది. మాచర పీఏసీఎస్ వద్ద, ఆయా గ్రామాల్లో రోడ్లపై కొబ్బరి చెట్టు విరిగి విద్యుత్ తీగలపై పడింది. గ్రామస్తుల సహకారంతో ఆయా గ్రామాల కార్యదర్శులు శివచక్రవర్తి, చినబాబు, పంచాయతీ కార్మికులతో కలిసి చెట్లను తొలగించారు. నేలటూరు, అద్దంకివారిలంక, మాచర, టేకి గ్రామాల్లో 8 విద్యుత్ స్తంభాలు విరిగిపడినట్టు ఏఈ తెలిపారు. మండలంలో 15 పునరావాస కేంద్రాల్లో 245 మందిని తరలించామని, మంగళవారం రాత్రికి మరింత మందిని తరలించనున్నట్లు తహసీల్దార్ శ్రీనివాస్ తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో పలు శాఖల అధికారులు, పంచాయతీ, సచివాలయ కార్యదర్శులు, రెవెన్యూ, పోలీస్, పంచాయతీ, వైద్య, ఆరోగ్య, సిబ్బంది, పలువురు ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

పునరావాస కేంద్రం పరిశీలన

రాయవరం(ఆంధ్రజ్యోతి): రాయవరం శ్రీరామయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని మంగళవారం ఎమ్మెల్యే వేగుళ్ల పరిశీలించారు. మండలంలో 540 మందిని పునరావాస కేంద్రాలకు తరలించామని, రాయవరం హైస్కూల్‌లో 219 మంది ఉన్నట్టు అధికారులు ఆయనకు తెలిపారు. రాయవరం పునరావాస కేంద్రాన్ని టీడీపీ సీనియర్ నాయకుడు ఉండవిల్లి రాంబాబు, మండపేట రూరల్ సీఐ పి.దొరరాజు, తహశీల్దారు టీవీ భాస్కరరావు, రామచంద్రపురం డీవైఈవో ప్రత్తి రామలక్ష్మణమూర్తి, ఎంఈవో వై.సూర్యనారాయణ, ఎస్ఎంసీ చైర్మన్ దేవిశెట్టి కోటేశ్వరరావు తదితరులు పరిశీలించారు. తహశీల్దారు కార్యాలయంలో కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

కూలిన చెట్లు: మండలంలోని ఆయా గ్రామాల్లో వీచిన భారీ ఈదురుగాలులకు చెట్లు నేలకూలాయి. పసలపూడి-మాచవరం, పసల పూడి రోడ్డులో చెట్లు కూలడంలో ఎస్ఐ డి.సురేష్‌బాబు ఆధ్వర్యంలో వాటిని తొలగించారు. రాయవరం దళితపేటలో పూరిపాకపై వేపచెట్టు కూలిపోగా, ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్ర మాదం తప్పింది.

26 పునరావాస కేంద్రాల ఏర్పాటు

ఆలమూరు(ఆంధ్రజ్యోతి): మండలంలో 26 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆలమూరు ఎంపీడీవో ఎ.రాజు తెలిపారు. మండలంలోని 18 గ్రామాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయడంతోపాటు అవసరమైన చోట్ల రెండు కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పంచాయతీ కార్యాలయాలలో హెల్ప్‌లైన్ సెంటర్లను ఏర్పాటు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. మంచినీటి ఇబ్బందులు లేకుండా జనరేటర్లు ఏర్పాటు చేసి నీటి సరఫరా చేస్తున్నామన్నారు.



రావులపాలెం: రావులపాడులోని తుఫాన్ పునరావాస కేంద్రంలో భోజనాలు వడ్డిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

విరిగిన చెట్లు: భారీ ఈదురుగాలులకు జొన్నాడ జాతీయ రహదారిపై రెండు చెట్లు విరిగిపడ్డాయి. ఆలమూరు ఎస్ఐ జి.నరేష్ ఆధ్వర్యంలో చెట్లను తొలగించారు.

స్తంభించిన జనజీవనం

ఆత్రేయపురం (ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ఈదురుగాలులు, భారీ వర్షాలతో జనజీవనం స్తంభించింది. ఆర్టీసీ బస్ సర్వీసులను రద్దు చేశారు. ఆయా గ్రామాల్లో కూటమి శ్రేణులు ఇంటింటికి వెళ్లి తుఫాన్‌పై ప్రజలకు అవగాహన కల్పించి పునరావాస కేంద్రాలకు తరలిస్తున్నారు. బొబ్బర్లంకలో పునరావాస కేంద్రాన్ని జడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావు, సర్పంచ్ నరాలశెట్టి సుబ్బలక్ష్మి సందర్శించారు. ఆత్రేయపురం, అంకంపాలెం, పులిదిండి గ్రామాల్లో భారీ వృక్షాలు నేలకొరిగాయి. ర్యాలిలో ఒకఇంటిపై కొబ్బరిచెట్టు కుప్పకూలింది. వాడపల్లి వెంకన్న ఆలయంలో తాత్కాలిక అన్నదాన షెడ్డును, తిరువీధుల్లో పెండల్స్‌ను ఉపకమిషనరు నల్లం సూర్యచక్రధర రావు పరిశీలించారు. పదిహేడు గ్రామాల్లో పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి నిర్వాసితులకు సహాయక చర్యలు చేపడుతున్నారు. అంకంపాలెంలో ఇటుకబట్టీల్లో పనిచేస్తున్న వివిధ రాష్ట్రాల వలస కార్మికులను హైస్కూల్‌లోని పునరావాస కేంద్రాలకు తరలించారు. సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ కరుటూరి నరసింహారావు, సర్పంచ్ ఎం.రాజు పునరావాస కేంద్రాల్లోని ఏర్పాట్లను పరిశీలించారు. ఆయా ప్రాంతాల్లో తహశీల్దారు రాజేశ్వరరావు, ఎంపీడీవో వెంకటరామన్, ఎస్ఐ రాముతో పాటు అధికారులు సహాయక చర్యలు చేపడుతున్నారు.

ఆహార పొట్లాలను పంపిణీ చేసిన మంత్రి

రామచంద్రపురం(ద్రాక్షారామ), అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): రామచంద్రపురంలోని వైఎస్ఆర్ నగర్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని మంత్రి సుభాష్ మంగళవారం రాత్రి పరిశీలించి బాధితులకు ఆయన ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, సత్యం వాసంశెట్టి ఫౌండేషన్ చైర్మన్ వాసంశెట్టి సత్యం, కృత్తివెంటి పేర్రాజు పంతులు ఎడ్యుకేషనల్ ట్రస్టు చైర్మన్ సలాది నాయుడు మాస్టారు, కవల నానాజీ, కంచుమర్తి బాబూరావు, జనసేన నాయకుడు బుంగ రాజు, ఏసుదాసు, కొప్పిశెట్టి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

రోజంతా పునరావాస కేంద్రాల్లో ఉండండి
ఆర్డీవో దేవరకొండ అఖిల

పునరావాస కేంద్రాల్లో ఉన్న వారంతా రోజంతా అక్కడే ఉండాలని ఆర్డీవో దేవరకొండ అఖిల కోరారు. ఆర్టీసీ బస్సులను రద్దు చేశామని బస్టాండ్లు, కాంప్లెక్సులకు రావొద్దన్నారు. మంగళవారం ఆర్డీవో కార్యాలయంలోని కంట్రోల్ రూమ్ నుంచి తుఫాను చర్యలను ఆమె పర్యవేక్షించారు.

కూలిన విద్యుత్ స్తంభం: తుఫాను ప్రభావంతో చెట్టుకూలి కరెంట్ వైర్ల మీద పడటంతో రామచంద్రపురం లోని ముచ్చిమిల్లిలో విద్యుత్ స్తంభం నేలకొరిగింది. దీంతో ఏఈ ఎం.వెంకటరమణ ఆధ్వర్యంలో లైన్‌మన్ వల్లు గోవిందు, సిబ్బంది విద్యుత్ స్తం భాన్ని సరిచేసి కరెంట్‌ను పునరుద్ధరించారు.

మెయిన్ రోడ్డులో వృక్షాల తొలగింపు: రామచంద్రపురంలోని మెయిన్ రోడ్డులో నీటిపారుదల శాఖ కార్యాలయం వద్ద ఉన్న భారీ వృక్షాన్ని అధికారులు తొలగించారు. ఈదురు గాలులకు రోడ్డుపై పడే అవకాశం ఉండటంతో ప్రధాన భాగాన్ని తొలగించారు. టౌన్‌హాల్ వద్ద ఉన్న చెట్టు కొమ్మలను కూడా తొలగించారు.

అప్రమత్తంగా ఉండాలి
కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు

కొత్తపేట(ఆంధ్రజ్యోతి): తుఫాన్ తీవ్రత దృష్ట్యా అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మంగళవారం తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో ఆర్డీవో పి.శ్రీకర్‌తో కలిసి పలు ప్రాంతాలను సందర్శించారు. తుఫాన్ తగ్గే వరకూ ఇళ్ల వద్దే ఉండాలని విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ బస్సులను రద్దు చేశామన్నారు. ఆయా శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్యే సూచించారు. కార్యక్రమంలో తహశీల్దారు వై.రాంబాబు, ఎస్ఐ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

తుఫాన్ ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు రెడీ: తుఫాన్ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ప్రజల ప్రాణాలు, ఆస్తులు సురక్షితంగా ఉండేలా అన్ని చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే బండారు అన్నా రు. మంగళవారం ఆయన వానపల్లి శివారు సంఘంపాలెం పునరావాస కేంద్రాలను ఆర్డీవో శ్రీకర్‌తో కలిసి పరిశీలించారు. కొత్తపేట నియోజకవర్గంలో 111 పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. పునరావాస కేంద్రంలో ఉంటున్న వారికి స్వయంగా ఆయన భోజనాలు వడ్డిం చారు. పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని రైతులకు సూచించారు.

కూలిన చెట్లు: మండలంలో పలుచోట్ల చెట్లు విరిగిపడి రాకపోకలకు అంతరాయం కలిగింది. ముఖ్యంగా అవిడి, గొలకోటిపాలెం, వాడపాలెంలలో రోడ్లపై పలుచెట్లు విరిగిపడ్డాయి. స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో భారీగా చెట్లు కూలడంతో పంచాయతీ కార్యదర్శి దాసరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో తొలగించారు.

తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధం
ఎమ్మెల్యే వేగుళ్ల

మండపేట(ఆంధ్రజ్యోతి): తుఫాన్‌ను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చెప్పారు. తుఫాన్ నేపథ్యంలో అధికార యంత్రాంగం చేపట్టిన చర్యలపై ఆయన మండల తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సమీక్ష నిర్వహించి వారికి పలు సూచనలు, సలహాలు చేశారు. నియోజక వర్గంలో ఎటువంటి పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులకు ఆయన సూచించారు. సమావేశంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి విజయలక్ష్మి, తహసీల్దార్ తేజేశ్వరరావు, ఎంపీడీవో సత్యనారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

కూలిన చెట్లను తొలగించాలి: ఈదురుగాలుల కారణంగా కూలిన చెట్లను ఎమ్మెల్యే వేగుళ్ల కూటమి నాయకులతో కలిసి పరిశీలించారు. కూలినచెట్లను యుద్ధప్రాతినకన తొలగించాలని ఆయన ఆదేశించారు. దెబ్బతిన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లను పునరుద్ధరించాలని ఆయన ఆదేశించారు. పట్టణంలో పారిశుధ్యంతో పాటు విద్యుత్ సరఫరా, మంచినీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఆయన వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ చుండ్రు శ్రీవర ప్రకాష్, వార్డు కౌన్సిలర్ కాశిన కాశీవిశ్వనాధం తదితరులు వున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం: మండపేటలోని బూరుగుంట చెరువు, ఆదిత్య కాలేజీ, ఎంపీడీవో కార్యాలయం, గొల్లపుంత ప్రాంతాల్లో చెట్లు పడిపోవడంతో రెండు విద్యుత్ ట్రాన్సుఫార్మర్లు దెబ్బతినడంతోపాటు, 15 విద్యుత్ స్తంభాలు కూలిపోయాయి. కూలిన చెట్లను యుద్ధప్రాతికన మున్సిపల్, విద్యుత్ సిబ్బంది తొలగించారు. విద్యుత్ సరఫరాకు అంతరాయం రాకుండా విద్యుత్‌శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. బూరుగుంట చెరువు వద్ద ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై రావిచెట్టు పడిపోవటంతో వెంటనే దాన్ని తొలగించారు. ఏడిదలో ఒక పెంకుటిల్లు దెబ్బతింది. ద్వారపూడిలో ఒకవ్యాన్‌పై చెట్టుపడి నష్టం కలిగించింది. ఆయా ప్రాంతాల్లో పలు చోట్ల చెట్లు కూలడంతో రాకపోకలకు అంతరాయం కలిగింది.



కపిలేశ్వపురం: టేకి పునరావాస కేంద్రంలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వేగుళ్ల

అధికారుల సమీక్ష: మండపేటలోని ఆయా గ్రామాల్లో పూరిళ్లలో ఉంటున్న వారు పునరావాస కేంద్రాల్లో తలదాచుకుంటున్నారని మండపేట నియోజకవర్గ ప్రత్యేక అధికారి వి.విజయలక్ష్మి అన్నారు. తుఫాన్ నేపథ్యంలో తహసీల్దార్ పి.తేజేశ్వరరావు, ఎంపీడీవో సత్యనారాయణమూర్తితో కలిసి మంగళవారం మండలంలోని ఆయా పునరావాస కేంద్రాల్లో సహాయ చర్యలను పర్యవేక్షించారు. ఏడిద, కేశవరం, ద్వారపూడి, ఇప్పనపాడు, తాపేశ్వరం, వేములపల్లి తదితర గ్రామాల్లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లో బాధితులకు అందుతున్న సాయంపై అధికారులు పర్యవేక్షించారు. సహాయక చర్యలపై వారు సంతృప్తి వ్యక్తం చేశారు.

పునరావాస కేంద్రాల పరిశీలన: మండలంలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను రామచంద్రపురం ఆర్‌డీవో అఖిల మంగళవారం పరిశీలించారు. ద్వారపూడి, ఏడిద, కేశవరంలో వున్న పునరావాస కేంద్రాలను ఆమె పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.

అప్రమత్తంగా ఉండాలి

రావులపాలెం(ఆంధ్రజ్యోతి): తుఫాన్ నేపథ్యంలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మంగళవారం రావులపాడులో ఉన్న తుఫాన్ పునరావాస కేంద్రాన్ని ఆయన పరిశీలించి అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వారికి భోజనాలు వడ్డించారు.

ఈదురుగాలులు: రావులపాలెం మండలంలో మధ్యాహ్నం నుంచి గాలి తీవ్రత పెరగడంతో వరి పంట పొలాలు నేలకొరుగుతున్నాయి. జన జీవనం స్తంభించింది.

ఆర్టీసీ బస్సుల రద్దు: తుఫాన్ నేపథ్యంలో రావులపాలెం డిపో నుంచి రాకపోకలు సాగించే 23 ఆర్టీసీ బస్సులను మధ్యాహ్నం అధికారులు రద్దు చేశారు. దీంతో గంటల తరబడి బస్సుల కోసం ప్రయాణికులు ఎదురుచూశారు.

నేలకొరుగుతున్న వృక్షాలు: తుఫాన్ నేపథ్యంలో వీస్తున్న ఈదురుగాలులకు భారీ వృక్షాలు నేలకొరుగుతున్నాయి. రావులపాలెం- అమలాపురం ప్రధాన రహదారిలో భారీ వృక్షం రహదారిపై నేలకొరిగింది. రావులపాలెం- గోపాలపురం జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న చెట్టు కొమ్మలు రోడ్డుపై పడ్డాయి. మండలంలోని ఆయా ప్రాంతాల్లో పలుచెట్లు నేలకొరిగాయి.